J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 10 11.8.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


• తరలిపోతున్న ప్రవాసాంధ్రుల సొమ్ము

## ఆంధ్రా టు అమెరికా వయా హైదరాబాదు!

**రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే.. వణికిపోతున్న ఎన్ఆర్ఐలు**

**ఆ**మె పేరు రియాచౌదరి(పేరు మార్చాం). ఆంధ్రాలోని ఒక మెట్ట ప్రాంతం ఆమె స్వస్థలం. ఆమెకి ఒక సోదరుడు కూడా ఉన్నాడు. ఇద్దరూ అమెరికాలో ఉంటారు. ఆమె తండ్రి ఒక రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి. 20ఎకరాల రైతు కూడా. 2018లో ఎకరా 10లక్షల లెక్కన అమ్మేశాడు. తాను పొదుపు చేసుకున్న

10లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
**స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు**
సం/-



## చిరంజీవి మళ్లీ రాజకీయాలలోకి వస్తారా?

➤ పిచ్చుకంత సినీ పరిశ్రమ.. కొండంత జగన్‌ను ఢీకొనగలదా?

**ఆం**ధ్రాలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సినీ పరిశ్రమ మొత్తం ఏకమై జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రచారం చేయబోతున్నారా? తాడేపల్లిలో అగ్రతారలకి జరిగిన అవమానం వారిలో ఇంకా రగులుతోందా? చిరంజీవి రాజకీయాలలోకి రీఎంట్రీ ఇవ్వనున్నారా? ఇలాంటి అనేక ప్రశ్నలకి రాజకీయ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానాలే ఎక్కువగా వినపడుతున్నాయి.


10లో

• టిటిడి ఛైర్మెన్‌గా..

## సుబ్బారెడ్డికి సెలవు కరుణాకరరెడ్డికి కొలువు

**లాయర్ డిసెంబర్‌లోనే చెప్పింది**

12లో







# నేత కార్మికుల వెతలు తీర్చండి

చేనేత కార్మికుల కష్టాలు తీర్చాలంటూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7న నెల్లూరులో ఏపీ చేనేత కార్మిక సంఘం, ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ వద్ద జరిగిన ఈ ఆందోళనలో నాయకులు పముజుల దశరథరామయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశంలో చేనేతను నిర్వీర్యం చేసేలా కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. చేనేతపై విధించిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికునికి వర్తింపజేయాలన్నారు. నాయకులు పముజుల హరి, కె.చైతన్య, రామరాజు, మాల కొండయ్య, నాగేశ్వరరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వాత్సల్య చిన్నారులకు నోట్‌పుస్తకాలు

నెల్లూరులోని వనంతోపు సెంటర్‌లో ఉన్న వాత్సల్య - జనహిత ఆధ్వర్యంలోని నిరాధార బాలల ఆశ్రమంలోని చిన్నారులకు, విద్యార్థులకు దాతలు శ్రీనివాసన్-హనుమాయమ్మ దంపతులు ఈనెల 6న నోట్‌పుస్తకాలను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

# హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు



బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం -1లో ఉన్న 100 మంది విద్యార్థులకు ఈనెల 6న సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. పుచ్చలపల్లి రాధాకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పుచ్చలపల్లి సతీష్‌కుమార్‌రెడ్డి తమ వితరణగా దుప్పట్లు అందజేశారు. సివిల్ సప్లయిస్ విజిలెన్స్ అధికారి వెంకటసుధాకర్, వార్డెన్ రమణయ్య, యజ్ఞానీబాషా, సొసైటీ సభ్యులు పటాన్ రహంతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధమాన జననీ

వందనాలే అందుకోవే వర్ధమాన జననీ
పుష్పమాల లేసుకోవే భరత మాత పావనీ

విశాల విశ్వాన నీకున్న ఘనతెంతో
నిను కొనియాడ బోవగా
మాటలు చాలకా
జాతి ఖ్యాతి ఝుండాకే
వందనా లొసగీ
ఐక్యతా బలమునే సాధించుకొన్నాము

శాంతి దూత జాతిపిత గాంధీ
ఆశయాల బాటలో
నవ భారత నిర్మాత జవహర్
మార్గాన
కోట్ల కొలది ప్రజలెల్లా సమైక్యతా పథమున
విజ్ఞాన వెలుగులో అజ్ఞానం
వదలుకొని
దారిద్ర్యాన్ని తరిమికొట్ట కంకణమే కట్టాము
నీ కృపతో మము కాపాడరావా
చెదురుమదురు సమస్యలు
తొలిగింపలేవా.



మండపాక అరుణకుమారి
హైదరాబాద్. 6300351221

# కాకాణి ఓటమి ఖాయం

**- సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జోస్యం**



రానున్న ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి ఓటమి ఖాయమని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఇటీవల నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకాణిపై విమర్శలు గుప్పించారు. ముత్తుకూరులో ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కామెడీ షో నిర్వహించారని, సర్వేపల్లిలో ఓడిపోవడం ఖాయమని తెలిసిపోయాక ఆ వత్తిడిని భరించలేక నెల్లూరుజనాన్ని సభలకు తోలుకొచ్చి చేరికల పేరుతో కాకాణి హడావుడి పడుతున్నారని ఆయన అన్నారు. కాకాణి సభలో వంద కుర్చీలు లేవు.. 200మంది జనం కూడా లేరు, అయినా 500 మంది వైకాపాలో చేరారని, అది 5వేల కుటుంబాల చేరికతో సమానమని ప్రచారం చేసుకోవడం కామెడీ కాక మరేమిటని ఆయన ఎద్దేవా చేశారు. ముత్తుకూరు సెంటర్‌లో సాధారణంగా ఆదివారం రోజున రెండు వేల మంది వరకు జనం ఉంటారు.. కానీ సభా ప్రాంగణంలో మాత్రం 200 మంది కూడా కనిపించలేదని, నెల్లూరు సిటీ, రూరల్ నియోజక వర్గాలకు చెందిన యువకులను తీసుకొచ్చి కామెడీ చేసి స్థానికులను అలరించారని ఆయన దుయ్యబట్టారు. వైఎస్ కార్యకర్తలు, సానుభూతి పరులకే కండువాలు కప్పి సంబరాలు చేసుకుంటున్నారంటూ కాకాణిపై ఆరోపణలు చేశారు. చేరికలంటే ఏ పార్టీ నుంచి వస్తున్నారు.. ఎంతమంది వస్తున్నారు.. ఎవరెవరు వస్తున్నారు అనే లెక్క ఉంటుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అనేక మంది వైకాపా నుంచి తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారని ఆయన ఈ సందర్భంగా వారి పేర్లతో సహా వివరించారు. మైనింగ్ మాఫియాను ప్రోత్సహించి ప్రకృతి వనరులను కొల్లగొట్టడం, కనుపూరు చెరువును నామరూపాల్లేకుండా చేయడం వంటివి మాత్రమే కాకాణికి తెలుసునని, ప్రజల సమస్యలు తీర్చడంపై ఆయన దృష్టి ఉండదని అన్నారు. ఎంతో నాణ్యమైన మట్టిని ప్రైవేటు లేఅవుట్లకు తరలించుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నాడని ఆయన విమర్శించారు. కాకాణి అండ్ బ్యాచ్ మట్టి మాఫియా ఆగడాలకు ఇటీవలే ఓ బ్యాంకు ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడని, మరికొందరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే రానున్న ఎన్నికల్లో కాకాణికి, వైకాపాకి పరాజయం తప్పదన్నారు. ప్రజలు టిడిపి వైపు మొగ్గుచూపుతున్నారని, సర్వేపల్లిలోనూ టిడిపి విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సభలకు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

**నెల్లూరు డిఎస్పీ శ్రీనివాసరెడ్డి**

నెల్లూరు నగర సబ్‌డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించాలంటే ముందుగా అనుమతి తప్పనిసరని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు యాక్ట్-30 అమలు చేస్తున్నామని నెల్లూరు నగర డిఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీ పోలీస్ యాక్ట్-30 ఈనెల 5 నుంచి ఆగస్టు 31 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

# యోగాలో నెల్లూరు విద్యార్థిని ప్రతిభ



తమిళనాడులోని గుమ్మిడిపూండిలో కైరళీ యోగా విద్యా పీఠం వారు నిర్వహించిన 17వ యోగా పోటీల్లో నెల్లూరు అవెన్యూస్ స్కూల్ విద్యార్థిని హేమిత తన సత్తాచాటుతూ తృతీయ బహుమతిని సాధించింది. స్కూల్ కరెస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ నీరా ప్రసాద్‌లు ఈనెల 6న స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హేమితను, యోగా ట్రైనర్ పద్మావతిని అభినందించి జ్ఞాపికలను బహుకరించారు.

# 12న యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఆగస్టు 12న యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీతాలివ్వకుండా వేధించడం మంచిపద్ధతి కాదన్నారు. జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు శేషులు, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గుడపల్లి డ్రైన్‌ను ఆధునీకరించాలి

**- బీజేపీ నమామిగంగే కన్వీనర్ మిడతల రమేష్**

బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణనగర్‌లో గుడపల్లి డ్రెయిన్ మురుగునీరు వీధిలోకి వచ్చేసిందని, అధికారులు ఇకనైనా ఆ మురుగునీటిని తొలగించి దానిని ఆధునీకరించాలని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి ఆ డ్రెయిన్ దుస్థితిని వివరించారు. 107 లింకులున్న కాలువ ఆక్రమణల మూలంగా 10 లింకులకు తగ్గిపోయిందని, మురుగునీరు పూడిక తీయకపోవడం వల్ల డ్రెయిన్ దుర్గంధం వెదజల్లుతూ రోడ్డుపైకి వస్తోందని తెలిపారు. దీని మరమ్మతుల కోసం మునిసిపాలిటీలో 5 లక్షల రూపాయల కేటాయింపు కూడా జరిగివుందని, జిల్లా కలెక్టర్ పరిశీలించి వెంటనే దాని బాగుకు కృషిచేయాలని కోరారు.

## శ్రీ రంగనాథునికి వేడుకగా..

# సహస్ర దీపాలంకార సేవ



నెల్లూరులోని ప్రసిద్ధమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు ఈనెల 6న కన్నుల పండువగా సహస్ర దీపాలంకార సేవ నిర్వహించారు. అనంతరం ఆ దీపాల వెలుగులో స్వామివారికి ఊంజల్ సేవ చేసి హారతులిచ్చారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, ఇఒ వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు

# విజయవాడలో 21, 22 తేదీల్లో ఎన్జీఓ మహాసభలు

ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడలో ఏపీ ఎన్జీఓ సంఘం 21వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, వెంకట స్వామి తెలిపారు. ఈనెల 6న ఆ సంఘం నాయకులు నెల్లూరులోని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కాకాణి చేతులమీదుగా మహాసభల గోడపత్రికలను ఆవిష్కరింపజేసి, మహాసభలకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. ఎన్జీఓల సంఘం నాయకులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, నందిమండలం ఆంజనేయవర్మ, గాదిరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 9న యానాదుల విజయభేరి



యానాదుల భవిష్యత్ కోసం గుంటూరులోని కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో సెప్టెంబరు 9న సుమారు లక్షమంది యానాదులతో 'యానాదుల రాజకీయ భేరి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం కన్వీనర్ కేసీ పెంచలయ్య తెలిపారు. ఆమేరకు ఈనెల 6న నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. యానాదులకు రాజకీయ పదవులివ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మైదాన ప్రాంతాల్లో నివసించే గిరిజన బాలికల కోసం జిల్లాకో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిని గుర్తించి వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫోరం రాష్ట్ర నాయకులు రాపూరు కృష్ణయ్య, యల్లపంల్లి రమేష్, సతీష్, మహిళా సంఘం నాయకురాళ్లు సిహెచ్ ఉష, రమ్య తదితరులు పాల్గొన్నారు.



# సేవా సంబరంలా శ్రీసిటీ 15వ పుట్టినరోజు

**• 425 మందికిపైగా ఉద్యోగుల రక్తదానం**

ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా, పారిశ్రామిక ప్రగతే ధ్యేయంగా, గ్రామీణ వికాసమే ఆశయంగా 08-08-2008న పురుడుపోసుకున్న శ్రీసిటీకి పదిహేనేళ్ళు నిండాయి. ఆ సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల8న వైభవంగా జరిగాయి. శ్రీసిటీ సామాజిక సేవలో భాగంగా రెండుచోట్ల రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్, నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీసిటీ ట్రేడ్ సెంటర్, బిజినెస్ సెంటర్‌లో రక్తదాన కేంద్రాలను ఏర్పాటుచేశారు. సుమారు 425మంది వలంటీర్లు, పరిశ్రమల ఉద్యోగులు ఈ శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేయడం విశేషం. గతంలోకన్నా మిన్నగా ఈ రక్తదాన శిబిరాల్లో పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొనడం పట్ల శ్రీసిటీ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం చేయడమంటే ప్రాణదానంతో సమానమని అంటూ, రక్తదానానికి సహకరిస్తున్న వారందరినీ ఆయన అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా రక్తదాతల డేటాబేస్‌ను శ్రీసిటీ ఫౌండేషన్ అందుబాటులో ఉంచుతుందని ఆయన తెలిపారు. ఉదయం 9.30 గంటలకు శిబిరం ప్రారంభమై సాయంత్రం 4.30 వరకు కొనసాగింది. పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు రక్తదానం చేశారు. సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ రమేష్, నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్వో ఎం.మధుసూధనరావు నేతృత్వంలోని బృందం ఈ శిబిరాన్ని నిర్వహించింది. శ్రీసిటీ ఫౌండేషన్ అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సెక్యూరిటీ చీఫ్ వై.రమేష్, హెచ్ ఆర్ ప్రతినిధి వి.శివకుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మొన్నటి రచ్చ...రేపటి రొచ్చుకేనా?

ఇటీవల పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన రచ్చ రాజకీయంగా అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇరుపార్టీల తీరు గమనిస్తుంటే ఎవరి ప్రణాళికలు వారికి ఉన్నాయా..? అన్న సందేహం కలుగుతోంది. ఎన్నికలకి ఇంకా ఆరునెలల గడువు ఉండగానే నువ్వా-నేనా అన్న తరహాలో చొక్కాలు మడుస్తున్న వైసీపీ, టీడీపీ శ్రేణుల ప్రవర్తన రాబోయే ఎన్నికలు ఎలా ఉండబోతాయో సూచిస్తున్నాయన్న అభిప్రాయం రాజకీయవర్గాలలో వ్యక్తమవుతోంది. ఒక దారిలో అనుమతి ఉంటే, మరోదారిలో రావడానికి ప్రయత్నం చేశారు, అందుకే హింస చెలరేగింది అని అధికార పార్టీ చెప్తోంది. మేం వెళ్లాలనుకున్న దారిని వైసీపీ శ్రేణులు అడ్డగించి తమపై దాడి చేశారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. లోతుగా పరిశీలిస్తే... అనేక ఆసక్తికర సందేహాలు కలుగుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

తమకు అనుమతి ఉన్న దారిలో తనపాటికి తాను వెళ్లిపోకుండా చంద్రబాబు మరోదారిలో వెళ్ళడానికి ప్రయత్నిస్తాడన్న అనుమానం వైసీపీ శ్రేణులకు ఎందుకు వచ్చింది...? వైసీపీ శ్రేణులు తమను అడ్డగిస్తారేమో అన్న సందేహం తెలుగు తమ్ముళ్లకు ఎందుకు కలిగింది..? అసలు ఈ వివాదానికి కారణం ఏమిటి..? అని ఆలోచిస్తే చంద్రబాబుకి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనాదిగా వస్తున్న వైరమే ఈ సంఘటనకి నేపథ్యం అని ఇరువర్గాల అభిప్రాయం. చదువుకునే రోజులనుండి వీళ్లిద్దరిమధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండిపోతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ పాత కక్షలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, తన అనుమతి లేనిదే బాబు పుంగనూరులో అడుగుపెట్టడానికి లేదని పెద్దిరెడ్డి, ఎలా పెట్టనీడో చూస్తా... అని చంద్రబాబుల మధ్య ఏర్పడిన పట్టుదలే ఈ వివాదానికంతటికీ కారణం అంటున్నారు.

అయితే, ఈ వివాదంలో చెలరేగిన హింసను చుస్తే భవిష్యత్తులో రాబోయే ఎన్నికలు ఇంకెంతటి భయోత్పాతాన్ని సృష్టించనున్నాయో అన్న అనుమానం కూడా చాలా వర్గాల నుండి వ్యక్తమవుతోందంటున్నారు విశ్లేషకులు. ఈ మొన్నటి రచ్చంతా రేపటి రొచ్చుకే అని, మెయిన్ షోకి ముందు ఇది ట్రెయిలర్ అన్న అభిప్రాయం కూడా మేధావులనుండి వ్యక్తమవుతోంది. అదే నిజమైతే, రాష్ట్రం రావణకాష్టం కావడం ఖాయం. అలాకాకుండా ఇది నిజంగా ఆ ఇద్దరి పాతకక్షల ఫలితమే అయితే, ఆ దుస్సాంప్రదాయం అస్సలు మంచిది కాదు! చంద్రబాబుపైన 11సెక్షన్లతో కేసులు పెట్టడం, బాబుని ఏ1గా చేర్చడం చూస్తుంటే రాష్ట్ర రాజకీయాలు తమిళనాడు పాలిటిక్స్‌ని తలపిస్తున్నాయన్నది జనవాక్కు..!



## వియ్యంకుడికి వీడ్కోలు స్నేహితుడికి స్వాగతం

గడిచిన 4 సంవత్సరాలుగా సమర్ధవంతంగా శ్రీవారికి సేవలందించిన తమ వియ్యంకుడు వై.వి.సుబ్బారెడ్డికి వీడ్కోలు చెప్తూ... టిటిడి కొత్త ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్‌రెడ్డిని స్వాగతిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, నెల్లూరు వాస్తవ్యులు, చెన్నై నివాసి కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి




మా పెద్దాయనకి

పుట్టినరోజు శుభాకాంక్షలు

సమర్ధత కలిగిన సీనియర్ న్యాయవాది
దయార్ద్ర హృదయమున్న మానవతావాది
మంచిని కాంక్షించే మా కుటుంబ శ్రేయోభిలాషి
మాకు కనిపించే దైవం - మా పెద్దాయన

నాగారెడ్డి శ్రీనివాసులరెడ్డి గారు

ఆగస్టు 11 న 75వ యేట అడుగిడుతున్న
ఆనంద తరుణంలో
పుట్టినరోజు శుభాకాంక్షలు.

వారు నిండు నూరేళ్ళు
ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో
మాకు కొండంత అండగా ఉండాలని
భగవంతుడిని కోరుకుంటూ...

ప్రత్తి శ్రీనివాసులు
(లేట్ ప్రత్తి సూరి కుమారుడు)
రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణం
నెల్లూరు. సెల్ : 9347102503.




లాయర్
ఆగస్టు 11, 2023

# న్యాయం, ధర్మం బ్రతికే ఉన్నాయి..!

రాజకీయాలలో వ్యక్తిగత ద్వేషాలు, ఉద్దేశపూర్వక చర్యలు మంచిది కాదని భారత అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య దేశం భారత్‌లో న్యాయం, ధర్మం బ్రతికే ఉన్నాయని రుజువు చేసింది. రాహుల్‌గాంధీ వ్యవహారంలో నిష్పక్షపాతంగా వ్యవహరించి స్వార్థపూరిత రాజకీయ వాదులకు చెంపపెట్టుగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయస్థానాలు కూడా పాలకుల కనుసన్నలలో పనిచేస్తున్నాయని ప్రచారం చేసేవారికి కనువిప్పు కలిగేలా రాహుల్‌గాంధీ కేసులో సుప్రీంకోర్టు వ్యవహరించింది. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఆధిపత్య ధోరణితో, అణిచివేత పోకడతో పాలన సాగిస్తున్న ఢిల్లీ పెద్దల దూకుడుకి న్యాయదేవత బ్రేకులు వేసింది. భారతదేశంలో న్యాయం నాలుగుపాదాలపై నడుస్తోందన్న నమ్మకాన్ని పెంచింది.

తమ ఇంటి పేరుతో మాట్లాడి రాహుల్‌గాంధీ తమని అవమానించారంటూ గుజరాత్‌కి చెందిన ఒక భాజపా శాసన సభ్యుడు రాహుల్‌పై సూరత్ కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఆయన పేరు పూర్ణేష్ మోడీ. నిజానికి ఆయన అసలు పేరులో మోడీ లేనే లేదు. అది ఆయన తరువాత తగిలించుకున్న తోక. ఇలాంటి సిల్లీ కేసులో సూరత్ కోర్టు సీరియస్‌గానే కాదు, స్పీడుగా కూడా స్పందించింది. రాహుల్‌కి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రెండేళ్లకంటే ఒక్కరోజు తక్కువ శిక్ష విధించి ఉండినా రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయివుండేది కాదు. సూరత్ కోర్టు తీర్పుపై కమలదళ పాలనలోని కేంద్ర ప్రభుత్వం కూడా వేగంగానే స్పందించింది. వెంటనే రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేసింది. ఆయన ఉంటున్న అధికార నివాసాన్ని ఖాళీ చేయించింది. రాహుల్ కూడా ఈ విషయంలో చాలా హుందాగా ప్రవర్తించారు.

తాజా గణాంకాల ప్రకారం 142 కోట్లమంది జనాభా ఉన్న భారతదేశంలో కొన్ని వేల కోర్టులలో లక్షల కేసులు సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్నాయి. కొన్ని కేసుల విషయంలో అయితే పరిష్కారం కాకుండానే వాద ప్రతివాదులిద్దరూ కాలం చేసిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆర్థిక నేరాలు చేసినవారు దేశం విడిచి వెళ్లిపోతున్నారు. హత్యలు, మానభంగాలు, దోపిడీలు, దుర్మార్గాలు చేసినవాళ్లు కూడా నిర్భయంగా తప్పించుకుని తిరుగుతున్నారు. కొన్ని రాష్ట్రాలలో రాజకీయ పదవులలో కూడా కొనసాగుతున్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే కేవలం ఇంటిపేరుతో మాట్లాడడన్న పెట్టీ కేసులో గాంధీ కుటుంబ వారసుడైన ఒక పార్లమెంటు సభ్యుడికి శిక్షను ఖరారు చేయడం, వెనువెంటనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయడం, మరుక్షణమే ఆయన ఉంటున్న అధికార నివాసాన్ని ఖాళీ చేయించడం వంటి చర్యలన్నీ రాజకీయకక్షతో చేసిన ఉద్దేశపూర్వక చర్యలేనని స్పష్టంగా అర్థమైపోతుంది.

రాజకీయాలలో వ్యక్తిగత దూషణలు, పరస్పర ఆరోపణలు సర్వ సాధారణం. ఇంటి పేరు వాడినందుకే వేసిన పరువునష్టం కేసులో రెండు సంవత్సరాల శిక్ష వేశారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో నేతలు వాడుతున్న భాష, తిట్టుకుంటున్న విధానం అత్యంత జుగుప్సాకరంగా ఉంటున్నాయి. వాళ్ళు ఒకరిపైన ఒకరు కేసులు పెట్టుకుంటే వాళ్ళ కేసులు వాదించడానికి ప్రస్తుతం ఉన్న న్యాయవాదులు, న్యాయస్థానాలు సరిపోవు. సూరత్ కోర్టు విధించిన తరహాలో ఈ రెండు రాష్ట్రాల నాయకులకు శిక్షలు వేయాలంటే భారతీయ శిక్షా స్మృతిలో న్యాయమూర్తులకు శిక్షలే దొరకవు. వాళ్ళు వాడే భాషకి అంతటి స్థాయిలో కఠిన శిక్షలు వేయాలి. రాజకీయాలలో ఇలాంటి సంప్రదాయం మంచిది కాదు. 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్లుగా రేపు అవతల పార్టీ అధికారంలోకి వస్తే, ఇదే తరహా కేసులుపెట్టే అవకాశం లేకపోలేదు. తమని పరిపాలించడానికి ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి ఇలా వ్యక్తిగత కక్షలకి, కార్పణ్యాలకి వాడుకోవడం మంచిది కాదు.

ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం రాహుల్‌కి సూరత్ ట్రయల్ కోర్టు విధించిన శిక్షను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రజాస్వామ్య దేశంలో ఇంకా న్యాయం, ధర్మం బ్రతికే ఉన్నాయన్న సంకేతాలను స్పష్టంగా ఇచ్చింది. రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని కేంద్రం మళ్ళీ పునరుద్ధరించింది. పార్లమెంటు సమావేశాలకు కూడా ఆయన హాజరయ్యారు. ఆయన గతంలో ఉన్న అధికార నివాసాన్ని ఆయనకి తిరిగి ఇచ్చేసింది. ప్రభుత్వపరంగా ఒక పార్లమెంటుసభ్యుడికి కల్పించవలసిన సౌకర్యాలన్నీ ప్రభుత్వం తిరిగి కల్పిస్తుంది.

"అడుసు త్రొక్కనేల కాలు కడుగనేల" అని అందుకే అన్నారు పెద్దలు.

# నాయకుల ఇళ్లకే పవర్ కట్ చేయొచ్చుగా..!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

విద్యుత్ శాఖకి చెందిన ఉద్యోగులు ఇటీవల సమ్మెలోకి వెళ్లారు. వాళ్ళు సమ్మె చేసే సమయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు మాత్రమే కరెంటుకి సంబంధించి ఫిర్యాదులు వస్తే స్పందిస్తామని చెప్పారు. సాయంత్రం 5 తరువాత విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలిగినా పక్కరోజు ఉదయం 10 తరువాతే పునరుద్ధరించడం జరుగుతుందని ఒక ప్రకటన ద్వారా సామాజిక మాధ్యమాలలో విద్యుత్ వినియోగదారులకు సమాచారం చేరవేశారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులకి ప్రజల తరపున నాదొక విన్నపం. మీ కష్టం ప్రభుత్వం పైన, మీ నిరసన అధికార పార్టీపైన, మరి అలాంటప్పుడు మీరు ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎంతవరకూ న్యాయం. క్రమం తప్పకుండా విద్యుత్ వినియోగదారులు చెల్లించే బిల్లులతోనే కదా మీరు జీతాలు తీసుకుంటున్నారు. సామాన్య జనాన్ని ఇబ్బంది పెట్టడం కరెక్టు కాదు. నాయకులపైన మీ ప్రతాపం చూపించండి. మీకు చేతనైతే వారి ఇళ్ళకి మాత్రం కరంటు కట్ చేయండి. మీ సమస్యలు పరిష్కరిస్తాం బాబో... అని వాళ్ళు మిమ్మల్ని బ్రతిమిలాడేలా వాళ్ళని అవస్థలపాలు చేయండి. అంతేగానీ, సామాన్య ప్రజలని ఇబ్బంది పెట్టొద్దు సోదరులారా..!

**ఆర్. బాబునాయుడు, ఆత్మకూరు.**

# ఆ వ్యాసం గూబ గుయ్‌మనేలాగే ఉంది

గతవారం మన 'లాయర్'లో భోగాది రాయుడు రాసిన 'బీజేపీ గూబ గుయ్' వ్యాసం విలువలున్న పాత్రికేయానికి అద్దం పట్టింది. గంజాయివనంలో తులసిమొక్కలా రాయుడులాంటి జర్నలిస్టులు జర్నలిజంలో ఇంకా మిగిలి ఉన్నారనడానికి 'మనలోమాట'లో నిర్మొహమాటంగా, నిష్పక్షపాతంగా ఆయన రాస్తున్న వాస్తవ విశ్లేషణలే ఉదాహరణ.


**కే. లక్ష్మీరెడ్డి, హైదరాబాదు.**

# వైసీపీ ప్రభుత్వంలో కళతప్పిన కళారంగం!

వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కళారంగం కళావిహీనంగా తయారయ్యింది. కళలని, కళాకారులని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. తమ ప్రతిభా నైపుణ్యాలతో ప్రజలని, తద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కళాకారులది కీలకపాత్ర. తాము చెప్పదలచుకున్నది జనానికి అర్థమయ్యేలా తమ ప్రదర్శనల ద్వారా చూపించగలిగిన సమర్థులు కళాకారులు. గత ప్రభుత్వాలన్నీ తమ పథకాలను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేసుకోవడానికి కళా సంస్థల్ని, కళాకారులని వాడుకునేవి. ముఖ్యంగా రామారావు ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారపర్వంలో కళాకారులు కీలక భూమిక పోషించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం కళాకారులను పట్టించుకున్న పాపాన పోలేదు. జగన్‌మోహన్‌రెడ్డికి సినిమావాళ్ళంటే ఎందుకో తెలియని వ్యతిరేకత ఉంది. కళాకారులంటే కేవలం సినిమావాళ్ళే కాదు. నటనే బ్రతుకుదెరువుగా ఆ రంగాన్ని నమ్ముకొని ఎంతోమంది స్టేజి ఆర్టిస్టులు తమ జీవనాన్ని సాగిస్తున్నారు. అన్ని వర్గాలవారికీ వరాలు ప్రకటించిన ముఖ్యమంత్రి కళారంగాన్ని మాత్రం గాలికొదిలేశారు. స్థానికంగా ఉన్న ఆయా జిల్లాల నాయకులన్నా కళాకారుల ప్రాధాన్యతను తమ నాయకుడికి వివరించి కళాకారుల జీవనోపాధికి ఆసరా కల్పిస్తే బాగుంటుంది.

**– పి.ఎల్. భరద్వాజ్, నెల్లూరు.**

# సమానత్వం కోసం పోరాడిన 'ఆధునిక విశ్వమానవుడు పెరియార్'





**ఆధునిక విశ్వ మానవుడు పెరియార్**
రచయిత:
డా॥ రాచపాళెం రఘు
పేజీలు : 128 వెల. 120/-
ప్రతులకు:
మణి బుక్ స్టాల్
సండేమార్కెట్, నెల్లూరు సిటీ
ఆంధ్రప్రదేశ్ - 524002.
సెల్: 7013591423

రాచపాళెం రఘు వృత్తిరీత్యా ఉపకార్మిక కమిషనర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ప్రవృత్తిరీత్యా హేతువాది, రచయిత, సమాజ సేవకుడు. గతంలో 7 గ్రంథాలను ప్రచురించి ఉన్నారు. ఇది ఎనిమిదవది. మహిమలు లేవని తెలియజేసే మ్యాజిక్ ప్రదర్శనలు ఇవ్వడం ఆయనకున్న మరో హాబీ. ఆధునిక చార్వాక, అభినవ లోకాయత, సాహితీ సామ్రాట్టు, నెల్లూరు వేమన్న ఆయనకున్న బిరుదులు. అంతేగాక చాలా సత్కారాలను పొంది ఉన్నారు. ఆయన తాజాగా రచించిన 'ఆధునిక విశ్వమానవుడు పెరియార్'లో సాంఘిక విప్లవకారుడు, ద్రావిడ రాజకీయవేత్త అయిన పెరియార్ రామస్వామి గురించి విపులంగా తెలియజేశారు. రామస్వామి ద్రావిడోద్యమ నిర్మాత, నాస్తికుడు. మత సంస్కృతిని వ్యతిరేకించాడు. కుల వ్యవస్థను దుయ్యబట్టాడు. హిందీ భాషను ద్రావిడుల మీద రుద్దటాన్నీ వ్యతిరేకించాడు. 1919 నుంచి 1925 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాడు. తర్వాత జస్టిస్ పార్టీలో చేరాడు. దాన్ని, ద్రావిడ కజగంగా మార్చాడు. దాన్నుంచే ద్రవిడ మున్నేట్ర కజగం ఏర్పడింది. ఈ పుస్తకంలో రచయిత రఘు లోతుగా వెళ్లి, పెరియార్ అంతరంగాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు. అజ్ఞానం, మూఢ నమ్మకాలు, మత సంస్కృతికి వ్యతిరేకంగా జరిపిన పోరాటాలు, ప్రతిపాదించిన వివిధ సంస్కరణలు, నాటి సమాజంపై ప్రభావం చూపిన తీరును కళ్లకు కట్టినట్టు చూపారు.

పెరియార్ పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు చెందినవారే! ఇది మన తెలుగువారికీ గర్వకారణమే! అసమానతలను మతాలు పెంచి పోషిస్తాయి. కాబట్టి ధనికులు, రాజకీయ నాయకులు మతాలను పోషిస్తారు. 'మానవజాతికి స్వతః సిద్ధంగా తర్కం, బుద్ధి, ఎదిరించే గుణాలు వస్తాయి. అయితే, అవి మతాల చేత అణిచివేయబడతాయి' అంటూ రచయిత రఘు వ్యాఖ్యానించడం సబబుగా తోస్తుంది. పెరియార్ ఉద్దేశం అదే! 'కుల మతాలు పోవాలి – సమత, సమానతలు రావాలి' అని పెరియార్ తన జీవితకాలంలో పరితపించాడు. ఆ లక్ష్యసాధనకు జీవితాన్ని అంకితం చేశాడు.

ఒక చోట ఆయనలోని నిస్వార్థాన్ని, త్యాగాన్ని రచయిత ఇలా చెప్పారు. 'గాంధీజీ పై అభిమానంతో గాంభీర్య దుస్తులు త్యజించాడు / సిగరెట్లు తమల పాకులు తృణీకరించాడు / మండీ వ్యాపారం మూసివేశాడు / ప్రజాసేవలో మమేకమయ్యాడు' అని. 'కల్లు దుకాణాల ముందు హర్తాళ్లు / తన జీవితం కఠిన శిక్షల జైలుపాలు / విడుదలయిన వెంటనే మళ్లీ ఉద్యమం/మళ్లీ జైలు జీవితం అయినా ఉద్యమాలు ఆపలేదు' అంటూ రామస్వామిలోని అకుంఠిత దీక్షను, మొక్కవోని ధైర్యాన్ని రచయిత హృద్యంగా చిత్రించారు.

"బడుగు బలహీన వర్గాలకు విద్యాసంస్థల్లో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో తొలి సవరణ చేయబడింది, పెరియార్ నిరంతర పోరాటాల వల్లే అని రచయిత ఈ గ్రంథంలో తెలియజేశారు. నాయకుడికి ఉపన్యాస శక్తి వజ్రాయుధం. పెరియార్ ఉపన్యాసాలతో జనాన్ని విపరీతంగా ఆకట్టుకునేవారు. ఆయన విరోధులు కూడా ఎక్కడో ఒకచోట దాక్కుని వినేవారు. ఆ ఉపన్యాసాలు తేలికయిన భాషతో, మంచి మంచి ఉదాహరణలతో, సామెతలతో నిండి ఉండేవి. సమాజంలో సాంఘిక సమానత్వం తీసుకు రావడానికి "సమత్వపురం కాలనీ" ఏర్పాటు చేయాలని ఆలోచనలు చేశాడు. 1991 నుండి ఆయన ఆలోచనలకు కార్యరూపం ఇచ్చింది డి.ఎం.కె ప్రభుత్వం.

"దేశ సంపద, దేశ వనరులు మొత్తం ఆ దేశం / ప్రజలందరి ఉమ్మడి ఆస్తి / కావున ఏ పదిమందో అనుభవించడం అన్యాయం". ఎనభై ఏళ్ళ కిందటే పెరియార్ ఆలోచనా విధానం అది. 94 ఏళ్ల తన జీవిత కాలంలో ఆయన ఎప్పుడూ మడమ తిప్పింది లేదు. తన ఆశయాలకు తిలోదకాలు ఇచ్చిందీ లేదు.

అందుకే రామస్వామి పెరియార్‌ను యునెస్కో గౌరవించింది. 1970 జూన్ 27వ తేదీన. ఇలాంటి గౌరవం ఒక్క పెరియార్‌కే దక్కింది. పెరియార్ నేటి యుగపు ప్రవక్త! దక్షిణాసియా సోక్రటీసు! సాంఘిక సంస్కరణల పితామహుడు.

అలాంటి మహానుభావుని జీవితంలోని ప్రతి అంశాన్ని, ప్రతి సంఘటనను, ప్రతి విశేషాన్ని అధ్యయనం చేసి, లోతుగా పరిశోధించి భావి తరాల వారికి స్ఫూర్తిమంతంగా రాచపాళెం రఘు అందించడం అభినందనీయం. ఆయన్నుంచి ఇలాంటి మరెన్నో విశేష గ్రంథాలు వెలువడాలని ఆశిద్దాం!



**డాక్టర్ గంగిశెట్టి శివకుమార్**
సెల్: 9441895343

18 నుండి 24 వరకు

# భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



➢ గొలగమూడిలో భారీ ఏర్పాట్లు

వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలో కొలువైవున్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఆగస్టు 18 నుంచి 24వ తేది వరకు స్వామివారి 41వ ఆరాధనోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాక తమిళనాడు, కేరళ, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు కనుక, భక్తులకు ఇబ్బందులు లేకుండా, మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా ఆశ్రమం వారు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 'ఆకలై కొంగు పట్టేవారికి అన్నం పెట్టాలయ్యా!.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా'..అంటూ మానవాళికి మహనీయమైన మానవతా విలువలను ప్రబోధించిన కరుణామూర్తి, అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయంలో నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. నిత్యం వందలసంఖ్యలో భక్తులు గొలగమూడికి వచ్చి స్వామివారిని దర్శించుకుని తరిస్తుంటారు. ఈ నేపథ్యంలో అశేష భక్తజనావళి పూజలందుకుంటున్న శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలను ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆశ్రమ కమిటీ వారు సన్నాహాలు చేస్తున్నారు.

### విశిష్ట పూజలు, వాహన సేవలు

ఉత్సవాలలో భాగంగా ఆగస్టు 18న ఉదయం 10 గంటలకు సర్వభూపాల వాహనం, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహన సేవ నిర్వహిస్తారు. 19న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు, 20న హనుమంత సేవ, హంసవాహన సేవ, 21న చినశేష వాహనసేవ, గజ వాహన సేవ, 22న అశ్వవాహన సేవ, పెదశేష వాహన సేవ, 23న సింహవాహన సేవ, గరుడ వాహన సేవ ఉంటాయి. 24న ప్రధానమైన ఆరాధనోత్సవం జరుగుతుంది. ఉదయం 10 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్ప మహోత్సవం కన్నులపండువగా జరుగుతాయి.

### ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

ఈనెల 7న గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం పరిపాలనా కార్యాలయంలో నెల్లూరు రెవిన్యూ డివిజనల్ అధికారి మలోల, గొలగమూడి ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అధికారులతో సమావేశమై ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించి తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు.

# ప్రైవేట్ టీచర్ల సమస్యలు తీర్చాలి

## మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

రాష్ట్రంలో సుమారు 80వేల మందికి పైగానే టీచర్లు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, వారి సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం కృషిచేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని అంబేద్కర్‌భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ టీచర్లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ, సరైన వేతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ నాయకులు ఈశ్వరయ్య, ఏపీటీఎఫ్ నాయకుడు సుబ్బారెడ్డి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు రామరాజు, నాయకులు సుబ్బారావు, రామనాథం, అనిల్‌కుమార్, చెన్నకేశవులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీది రెండు నాలుకల ధోరణి

## సిపిఐ నాయకుల విమర్శ



మణిపూర్ ఘటనల విషయంలో బీజేపీ రెండు నాలుకల ధోరణి అవలంభిస్తోందని, అక్కడి పరిస్థితులు దయనీయంగా ఉన్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ విమర్శించారు. ఈనెల 6న ఆత్మకూరులో జరిగిన సిపిఐ రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకుని మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలన్నారు. రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తోందని, ప్రతిపక్ష నాయకుల సభలపై జరుగుతున్న దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం మానుకుని సొంతక్షేమం కోసం ఆరాటపడుతున్నాయని ఆయన విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, మాలకొండయ్య, అరిగెర్ల సాయి, ఆత్మకూరు పట్టణ సిపిఐ నాయకుడు యామాల మధు పాల్గొన్నారు.

# నీటి పారుదల పనులను గాలికొదిలేశారు

○ వైకాపా తీరుపై చంద్రబాబు ధ్వజం

○ నెల్లూరులో టీడీపీ నాయకులతో బాబు సమీక్ష



టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 6న నెల్లూరుకు వచ్చి కస్తూరిదేవి గార్డెన్స్‌లో టిడిపి నాయకులతోను, స్థానిక ప్రముఖులతోను సమావేశమయ్యారు. ప్రత్యేకించి జిల్లాలో సాగునీటి పరిస్థితులను సమీక్షించారు. జిల్లాకు ప్రాణప్రదమైన తెలుగుగంగ ప్రాజెక్టును తెచ్చి జిల్లాను సస్యశ్యామలం చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఆ ఘనత ఒక్క ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు అటవీ అనుమతులు తెచ్చి, కోట్లాదిరూపాయలు వెచ్చించి, లక్షలాది ఎకరాల ఆయకట్టును సాగులోకి తెచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అయితే ఇప్పుడు ఆ ప్రాజెక్టులు దయనీయంగా ఉండడం విచారకరమని అన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి పరమ అధ్వాన్నంగా ఉందన్నారు. పలు ప్రాజెక్టుల పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయని, ఆప్రాన్ దెబ్బతినడంతో సోమశిల జలాశయం ప్రమాద పరిస్థితుల్లో ఉందని, అయినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గండిపాళెం ప్రాజెక్టు నిర్వహణను నిర్లక్ష్యం చేశారని, ఇంకా అనేక ప్రాజెక్టుల పరిస్థితి దీనాతిదీనంగా ఉందని, అవగాహన లేని వ్యక్తి సిఎం కావడంతో రాష్ట్రానికి దౌర్భాగ్యం చుట్టుకుందని ఆయన దుయ్యబట్టారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని, ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తామని బాబు చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని, వైకాపాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

### అజీజ్‌కు.. బాబు పరామర్శ

అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను చంద్రబాబునాయుడు పరామర్శించారు. అజీజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో చంద్రబాబు వెంట టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, దేవినేని ఉమా, ఆనం రామనారాయణరెడ్డి, బీద రవిచంద్ర, పనబాక లక్ష్మి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, జడ్.శివప్రసాద్, చెంచలబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి ఆశయసాధనలో తనయుడు

## గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో.. గాండ్ల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరులో గాండ్ల తెలికుల సంక్షేమ సంఘానికి పెద్దదిక్కుగా ఉన్న మురళీకృష్ణ హోటల్ అధినేత గ్రోసు గోపాలయ్య కొంతకాలం క్రితం పరమపదించినా, ఆయన కుమారుడు గ్రోసు సుబ్బారావు తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయసాధనకు శక్తివంచన లేకుండా కృషిచేస్తుండడం విశేషం. తండ్రి తర్వాత ఆ సంఘానికి తాను అధ్యక్షునిగా ఉంటూ సంఘ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ గాండ్ల తెలికుల కులస్తులకు ఆయన సేవలందిస్తున్నారు. ఇటీవల పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన గాండ్ల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న ప్రతిభా పురస్కారాలను అందజేశారు. స్థానిక మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 16 మంది విద్యార్థులకు గ్రోసు సుబ్బారావు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి వారిని అభినందించారు. దాదాపు 20ఏళ్ళ క్రితం తమ తండ్రి గ్రోసు గోపాలయ్య గాండ్ల తెలికుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటుచేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులు మంజూరు చేయాలని, నిరుపేద గాండ్ల తెలికుల కులస్తులకు సబ్సిడీ రుణాలివ్వాలని, వృత్తిదారులకు ఉచిత విద్యుత్‌ను కేటాయించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు గిద్దలూరు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి హరగోపాల్, కార్య నిర్వాహక అధ్యక్షులు చాకిరాల శేషయ్య, ఉపాధ్యక్షులు గ్రోసు మురళీకృష్ణ, మాడిశెట్టి గురునాథం, కోశాధికారి వంజవాక ధనుంజయతో పాటు వరికుంట్ల సురేష్‌బాబు, డాక్టర్ చైతన్య, డాక్టర్ రమేష్‌బాబు, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఆదిశంకర కాలేజీ ప్రిన్సిపాల్ వేణుమాధవ్, సిరిగిరి సత్యనారాయణ, చిట్టెంశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు కేంద్రం న్యాయం చేయాలి

బీసీల డిమాండ్ల విషయమై ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి తగు న్యాయం చేయాలని సీమాంధ్ర బీసీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. ఈనెల 6న నెల్లూరులోని బీసీ సంక్షేమ సంఘం స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అనంతరం విశాఖ జిల్లా సీమాంధ్ర బీసీల సంఘం అధ్యక్షునిగా చెల్లుబోయిన సింహాచలంయాదవ్‌ను నియమించి బాధ్యతలు అప్పగించారు. నాయకులు పైడిరాజు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లు, వార్డు స్థానాలకు.. 19న ఎన్నికలు

జిల్లాలో ఖాళీగా ఉన్న 2 సర్పంచ్ స్థానాలకు, మరో 63 వార్డు సభ్యుల స్థానాలకు ఆగస్టు 19వ తేదీన ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 10వతేది వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా స్థానాలకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని జిల్లా పంచాయతి అధికారి సుస్మితారెడ్డి ఈనెల 6న ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు 11వ తేదీన పరిశీలించడం జరుగుతుందని, ఉపసంహరణలు 14న జరుగుతాయని, అవసరమైతే 19తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని ఆమె తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

# నెల్లూరు కబుర్లు




## క్రైస్తవ సోదరుల శాంతి ర్యాలీ

మణిపూర్ ఘటనలకు నిరసనగా నెల్లూరులో ఈనెల 8న క్రైస్తవ సోదరులు పెద్దఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సమైక్యవేదిక ఆధ్వర్యంలో ఏబిఎం కాంపౌండ్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. మణిపూర్ బాధిత కుటుంబాలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. ఆర్‌సిఎం చర్చి బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎం.డి ప్రకాశం మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ ఐకమత్యంతో జీవించాలన్నారు. మణిపూర్ సమస్యలను కేంద్రం వెంటనే పరిష్కరించి పరిస్థితులను చక్కదిద్దాలని కోరారు. బి.డేవిడ్ దయాసాగర్, వి.సురేంద్ర బాబు, రాజశేఖర్ దాసరి, జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్నా పక్కనే ఉన్నా..తాగేందుకు నీళ్లు లేవన్నా!

### సిపిఎం ఆందోళన



పెన్నానది పక్కనే ఉన్నప్పటికీ నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో తాగేందుకు నీళ్లు లేకపోవడం దారుణమంటూ సిపిఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న స్థానిక 56వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో సిపిఎం నాయకులు పెద్దఎత్తున ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. సిపిఎం జిల్లా అధ్యక్షుడు మూలం రమేష్ మాట్లాడుతూ, నగరంలోని వెంకటేశ్వరపురంలోనూ, కొన్ని కాలనీల్లోనూ నేటికీ నీటికోసం ప్రజలు నానా యాతనలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల దాహార్తిని తీర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మూలం ప్రసాద్, శేషయ్య, జాఫర్, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



విధి నిర్వహణలో మృతి చెందిన హోం గార్డు జి.రాజేష్ కుటుంబానికి ఆర్థికసాయంగా జిల్లాలోని హోంగార్డులం దరూ ఇచ్చిన ఒకరోజు వేతనం 3,86,950 రూపాయల చెక్కును ఈనెల 8న జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి చేతుల మీదుగా మృతుని భార్య శిరీషకు అందజేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ చెప్పారు. పిల్లలను బాగా చదివించి వృద్ధిలోకి తేవాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆమెకు సూచించారు. ఏఎస్పీ డి.హిమవతి, ఆర్ఐ పాల్‌రాజ్, పి-సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' కిట్లు పంపిణీ



నెల్లూరులోని 20వ డివిజన్‌లో ఉన్న కొండాయపాళెం అంగన్‌వాడీ స్కూల్‌లో ఇటీవల 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పథకం కింద గర్భిణీస్త్రీలకు బియ్యం, కందిపప్పు, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, నూనెలు, అటుకులు, బెల్లం, చిక్కి, ఖర్జూరం తదితర పౌష్టికాహార సరుకులున్న కిట్‌లను అందజేశారు. 20వ డివిజన్ సీనియర్ నాయకులు, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), నెల్లూరు ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు తాళ్లూరి సురేష్‌బాబుల ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరిగింది. 20వ డివిజన్ కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, నర సింహారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సరళమ్మ, పోతురాజు, రమాదేవి, కడివేటి లక్ష్మీప్రసన్న, పద్మజాయాదవ్, పాఠశాల హెడ్మాస్టర్, అంగన్వాడీ టీచర్లు రాజకుమారి, రాణి, సునీత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీబీకి అరుదైన గౌరవం

- సిఎం చేతులమీదుగా పురస్కారం



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబి)కి అరుదైన గౌరవం దక్కింది. ఉత్తమ పనితీరుతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలకు అండగా నిలబడి రైతాంగానికి విశేష సేవలందించినందుకు, సౌత్‌కోస్ట్ రీజియన్‌లో 'ది బెస్ట్ డీసీసీబీ'గా నెల్లూరు డీసీసీబీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డును అందుకొంది. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్)ను స్థాపించి అరవైఏళ్ళు పూర్తయిన సందర్భంగా విజయవాడలో ఇటీవల జరిగిన వజ్రోత్సవాల్లో ఆ అవార్డును బ్యాంక్ ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సిఇఒ డాక్టర్ చల్లా శంకర్‌బాబులకు సీఎం బహుకరించారు. అవార్డుతో పాటు లక్షా 50వేల రూపాయల బహుమతిని కూడా అందజేసి వారిద్దరినీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లూరు డీసీసీబీ పాలకవర్గాన్ని అందరూ అభినందించారు.

## పారిశుధ్య పనుల్లో అశ్రద్ధ వద్దు

### కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్



పారిశుధ్యపనుల్లో సిబ్బంది అశ్రద్ధ వహించకూడదని, ఇంటింటా చెత్తసేకరణలో అలక్ష్యం వద్దని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ స్పష్టం చేశారు. ఈనెల 8న ఆయన స్థానిక పొదలకూరురోడ్డులోని సారాయంగడి సెంటర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తసేకరణ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న శానిటరీ కార్యదర్శిపై మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. రోడ్లపై ఎవరూ వ్యర్థాలను వేయవద్దని ప్రజలకు సూచించారు. దుకాణాల వద్ద తడి, పొడి చెత్తకుండీలను తప్పకుండా ఏర్పాటుచేయాలన్నారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 67వ భాగం

జరాసంధుడు, భీముని చేతిలో మరణించగానే, ధర్మరాజుకి ఇక రాజసూయ యాగం చేయటానికి అవరోధాలన్నీ తీరిపోయి, ఇక ఆ యాగ నిర్వహణ ప్రారంభించాలని సంకల్పిస్తాడు. కానీ, ఆ యాగ నిర్వహణకి కావాల్సిన నిధులకొరకు, తమ్ముళ్ళయిన భీమార్జునలని, నకులసహదేవులని, నాలుగు దిక్కులవైపు దండెత్తి పోవలసిందని ప్రోత్సహిస్తాడు.




అర్జునుడు ఉత్తరదిశగా, భీముడు తూర్పు దిశగా, నకులుడు పశ్చిమ దిశగా, సహదేవుడు దక్షిణ దిశగా చతురంగ బలాలతో బయలుదేరి వెళ్లి, ఎదిరించిన రాజులను ఓడించి, సంధి చేసుకున్న రాజులను కరుణించి సామంతులుగా చేసుకుని వారి వద్ద నుంచి అమిత ధన, కనక, వస్తు, వాహనాలను సంపాదించి, దిగ్విజయంగా ఇంద్రప్రస్థ నగరానికి తిరిగివచ్చారు.

ధర్మరాజు ఐశ్వర్యం... వరుణ, కుబేర, దేవేంద్రులకన్నా వేయి రెట్లు ఇనుమడించింది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## నారద మహర్షి జయంతి

నెల్లూరులో ఈనెల 8న నారద మహర్షి జయంతి జరిగింది. స్థానిక పప్పులవీధి సమీపంలోని జేసీస్ భవన్‌లో సాహితీసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు సుధాకర్ రావు కస్తూరి, పోస్టల్ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ ప్రాంత సంచాలక్ బయ్యా శ్రీనివాసులు, డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, కోడూరు సత్యం, గుర్రం సుధాకర్, రామదండు ఉదయ్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు పాత్రికేయులను సన్మానించారు.

## రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి



నెల్లూరులోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఆగస్టు 7న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు విద్యార్థులతో కలిసి రవీంద్రుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవీంద్రుని జీవితం గురించి వివరిస్తూ, ఆ మహనీయుని దేశభక్తి అందరికీ స్ఫూర్తిదాయకమని విద్యార్థులకు తెలియజెప్పారు. ఉపాధ్యాయులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ అభివృద్ధి అభినందనీయం

## కొనియాడిన యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్




శ్రీసిటీ అభివృద్ధి అభినందనీయమని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాన్సుల్ జనరల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా) జెన్నిఫర్ లార్సన్ శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. ఈనెల 3న ఆమె శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీలో వ్యాపారానుకూల వాతావరణం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీసిటీలో అమెరికన్ కంపెనీలు మంచి వృద్ధిని సాధించడం పట్ల సంతోషం వెలిబుచ్చారు. యూఎస్–ఇండియా సంబంధాలు మరింతగా పరిపుష్టం కావడానికి శ్రీసిటీ లాంటి వ్యాపార కేంద్రాల కృషి ప్రశంసనీయమన్నారు. మేక్ ఇన్ ఇండియాలో అమెరికన్ కంపెనీల పాత్రకు ఇది చక్కని ఉదాహరణగా ఆమె అభివర్ణించారు. తొలుత, శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు సాదర స్వాగతం పలికారు. వైస్ కాన్సుల్ జనరల్ అఖిల్ బెరీ, ఆర్థిక వ్యవహారాల నిపుణుడు సిబా ప్రసాద్ త్రిపాఠి, యూఎస్ ఫారిన్ కమర్షియల్ సర్వీస్ కమర్షియల్ అడ్వైజర్ సునీల్ కుమార్ తదితరులు కాన్సుల్ జనరల్‌తో పాటు శ్రీసిటీకి వచ్చారు. శ్రీసిటీలో మౌలిక సదుపాయాలు, ప్రత్యేకతల గురించి వారికి శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. పెప్సికో, క్యాడ్‌బరీస్, కోల్‌గేట్ పామోలివ్, విఆర్వీ చార్ట్ ఇండస్ట్రీస్, బాల్ కార్పొరేషన్, కెల్లాగ్స్ వంటి ప్రధాన బ్రాండ్‌లతో సహా పదకొండు అమెరికన్ కంపెనీలు శ్రీసిటీలో తమ పరిశ్రమలు ఏర్పాటు చేశాయని తెలిపారు. అనంతరం, తన పర్యటన జ్ఞాపకార్థం పరిశ్రమ ఆవరణలో జెన్నిఫర్ లార్సన్ మొక్కను నాటారు.

## ప్రభుత్వ స్కూళ్లకు శ్రీసిటీ 'రాకవర్త్' వితరణ



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా శ్రీసిటీలోని రాకవర్త్ పరిశ్రమ పరిసర 3 ప్రభుత్వ స్కూళ్లకు 1.5 లక్షల రూపాయల విలువ చేసే 25 పెడస్టల్ క్యాబినెట్స్ (ఆఫీస్ డాకుమెంట్స్, వస్తువులు భద్రపరిచే ర్యాకులు) వితరణ ఇచ్చారు. ఇందులో ఇరుగుళం జడ్పీహైస్కూల్‌కు 11, మాదనపాలెం జడ్పీ హైస్కూల్‌కు 11, చెరివి ప్రాథమిక పాఠశాలకు 5 ర్యాకులు పంపిణీచేశారు. ఆ పరిశ్రమ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీరామ్ రాయన, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో బీఎంఆర్

న్యూఢిల్లీలో ఈనెల 7న జరిగిన ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు, బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) పాల్గొన్నారు. పార్లమెంట్ భవనంలో జరిగిన ఈ సమావేశంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులైన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుతో పాటు, కమిటీ చైర్మన్ సత్యపాల్, పార్లమెంట్ సభ్యులు బాలశౌరి, శ్యాంసింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ



రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, తిరుపతి జిల్లా వైకాపా ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. దీంతో రామ్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇటీవల వెంకటగిరిలోని 18వ వార్డులోని పోలిశెట్టి గుంట పార్క్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు రామ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికారు. 'మీరు గడప గడపకు తిరగడంవల్ల వెంకటగిరిలో ఎంతో మార్పు వచ్చిందని, అభివృద్ధి పనులు బాగా జరుగుతున్నాయని' విద్యార్థులు, స్థానిక ప్రజలు ఆయనకు సంతోషంగా తెలియజేశారు.

## వృద్ధులకు అన్నదానం



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మామ రావూరు సుబ్బారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న ఆదాల ప్రభాకర్‌రెడ్డి – వింధ్యావళి దంపతుల సహకారంతో నెల్లూరు రూరల్‌లోని నారాయణరెడ్డిపేట బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైకాపా నాయకుడు పేర్నేటి కోటేశ్వరరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, జానా నాగరాజుగౌడ్, ఒట్టూరు సుధాకర్, రామ్మోహన్, శివసాయి, సునీల్‌రెడ్డి, రామిరెడ్డి, వెంకయ్య, లక్ష్మీ నరసారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## రామాలయానికి.. ప్రసన్న రూ.50 వేల విరాళం



విడవలూరు మండలంలోని వెంకటరెడ్డిపాళెం మత్స్యకార సొసైటీలో రామాలయం నిర్మాణం కోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల 50వేల రూపాయల విరాళం అందజేశారు. ఆ విరాళాన్ని స్థానిక వైకాపా నేత, మాజీ ఏఎంసి ఛైర్మెన్ రామిరెడ్డి విజయభానురెడ్డి గ్రామకాపుల సమక్షంలో ఊటుకూరు సర్పంచ్ మేకల పోలయ్య ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ నిర్వాహకులకు అందజేశారు.

## ఎన్‌బికెఆర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సత్యవేటి పీటర్ విఎస్‌యు (విక్రమ సింహపురి యూనివర్శిటీ) నుంచి ఇటీవల డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. 'అల్లీగరైజింగ్ ఎపోలిటిజమ్ ఏ స్టడీ ఆన్ జాన్‌మిల్టన్స్ పారడైజ్ లాస్ట్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రరెడ్డి తదితరులు ఆయన్ను అభినందించారు.




# ఏపీలో గ్యాస్ పైప్‌లైన్ ఎప్పటికి పూర్తిచేస్తారు?

## - పార్లమెంట్‌లో వేమిరెడ్డి ప్రశ్న



'వన్-నేషన్-వన్-గ్యాస్‌గ్రిడ్' పథకం కింద కేంద్రం 33,500 కిలోమీటర్ల సహజవాయువు పైప్‌లైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందా?..అలా అయితే ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ-విశాఖ, శ్రీకాకుళం సహజ వాయువు పైప్‌లైన్ ఏర్పాటును ఎప్పటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?.. పైప్‌లైన్ ప్రాజెక్ట్ ప్రస్తుత స్థితిగతులపై వివరాలు తెలపమని ఈనెల 7న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకు కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ మంత్రి రామేశ్వర్ తెలి సమాధానమిస్తూ, ప్రాథమిక ఇంధన మిశ్రమంలో సహజవాయువు వాటాను పెంచే లక్ష్యంతో ఆ పథకం ద్వారా దేశంలో సహజ వాయువు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించిందని, పెట్రోలియం మరియు నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డ్ ఆధ్వర్యంలో 33,592 కిలోమీటర్ల సహజ వాయువు పైప్‌లైన్ నెట్‌వర్క్ అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 23,173కి.మీ సహజవాయువు పైపులైన్లు, స్పర్ లైన్లు, టై-ఇన్ కనెక్టివిటీ, సబ్-ట్రాన్స్‌మిషన్ పైప్‌లైన్‌లు ప్రత్యేక పైప్‌లైన్‌లు ఉన్నాయన్నారు. ఇప్పటికే 12,206 కి.మీ పొడవు పైప్‌లైన్ నిర్మాణం వివిధ దశల్లో ఉందని, కాకినాడ-వైజాగ్-శ్రీకాకుళం సహజవాయువు పైప్‌లైన్ కూడా ఇందులో భాగమేనని, ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ దీని బాధ్యతను చూస్తుందన్నారు. జూన్ 2024 కల్లా పనులు పూర్తిచేస్తామని వివరించారు.

# వైకాపా పాలనలో 'అప్పులాంధ్ర'గా మారిన రాష్ట్రం

## - మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ



అన్నపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ వైకాపా పాలనలో 'అప్పులాంధ్ర'గా మారిపోయిందని, నాలుగేళ్ళ పాలనలో వైకాపా దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి అప్పుల్లో అగ్రగామిగా ఉందని, ఇంతటి ఘనత ఒక్క జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 8న ఆయన వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు పంచాయతీలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వైకాపా పాలన తీరును వివరించారు. ఒక్క అప్పుల్లోనే కాదు, ఆత్మహత్యల్లోనూ మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, వైకాపా నిర్లక్ష్యంతో రైతుల బతుకులు దయనీయంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి అరాచకపాలన సాగిస్తున్నారని, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై అక్రమకేసులు బనాయిస్తూ వేధిస్తున్నారని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గంలోని కొండలను, తిప్పలను, చెరువుల్లో గ్రావెల్‌ను కూడా మంత్రి కాకాణి, వైకాపా నాయకులు కొల్లగొడుతూ వందలాది కోట్ల రూపాయల ప్రకృతివనరులను తినేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాకాణి అండదండలతో నేటికీ నిత్యం గ్రావెల్ దోపిడీ జరుగుతూనే ఉందని, దొరికిందల్లా దోచుకోవడం, దాచుకోవడం పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా కురిచెర్లపాడు మాజీ సర్పంచ్ కొంగర పెంచలయ్యతోపాటు ఇస్లాంపేటలో పలువురు టీడీపీలో చేరగా, వారికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉషమ్మ, టీడీపీ మండల అధ్యక్షులు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు రావూరి రాధాకృష్ణమనాయుడు, మావిళ్ళపల్లి శ్రీనివాసులునాయుడు, పాపానాయుడు, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 'పీఎం స్వనిధి' పథకం..చిరువ్యాపారులకు వరం

పీఏం స్వనిధి పథకం చిరువ్యాపారులకు వరమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఈ పథకం వీధి వర్తకులకు, చిన్నచిన్న వ్యాపారులకు, వారి కుటుంబాల ఆర్థికవృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ చెప్పారు. ఈనెల 8న ఆయన నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఈ పథకం లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, బకాయిలను సకాలంలో తిరిగి చెల్లించి మరింత మొత్తంలో రుణాలు పొందేందుకు అర్హత సాధించాలని కోరారు. 10వేల నుంచి 50 వేల రూపాయల రుణ మొత్తాన్ని మూడేళ్ళ కాలంలో తిరిగి చెల్లించేలా ఈ పథకంలో వెసులుబాటు కల్పించారని, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని వీధి వర్తకులు, చిరువ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు వారి వ్యాపారాలకు అధికవడ్డీలకు వడ్డీవ్యాపారస్తుల నుంచి అప్పులు తీసుకోకుండా, వారి జీవనానికి అవసరమైన రుణాలిచ్చేందుకు ప్రభుత్వాలు ఈ ఏర్పాటు చేశాయన్నారు. నెల్లూరు నగర పరిధిలో రోడ్డుమార్జిన్ వ్యాపారులు ఎంతమందికైనా రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సమావేశంలో పాల్గొన్న మెప్మా పీడీ రవీంద్ర తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు రుణాలు అందజేయడంలో ప్రతిభచూపిన పలువురు మెప్మాసిబ్బందిని కమిషనర్ సన్మానించారు. ఎల్డీఎం ప్రదీప్‌కుమార్, సీఎంఎం పెంచలయ్య, జరీనా, ఎల్‌హెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఓటర్ల సమగ్ర సర్వే పూర్తి చేయాలి



ఆర్‌డిఓ కిరణ్‌కుమార్

ఓటర్ల జాబితాలో సమగ్ర సర్వే త్వరితగతిన పూర్తి చేసేలా సిబ్బంది కృషి చేయాలని, జాబితాల పరిశీలనలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో ఎస్ఇఆర్, బిఎల్‌వోలతో ఇటీవల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ లీలారాణి పాల్గొన్నారు.

కాగా, స్పందన కార్యక్రమంలో గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలో చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్త శివకుమార్, బీజేవైఎం నాయకుడు మనోజ్, విశ్రాంత అధ్యాపకుడు లక్ష్మీనారాయణ ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

# సిఆర్ రెడ్డి 'ఆరోగ్య సంజీవని'



డాక్టర్ సి.ఆర్.రెడ్డి పేరు మీద గూడూరు ప్రగతి సేవా సంస్థ ప్రతి నెల నిర్వహించే 'డా. సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని' కార్యక్రమం ఈ నెల 9వ తేదీ బాలాజీనగర్‌లోని ప్రగతి కార్యాలయంలో జరిగింది. డా. సి.జనార్దన్‌రెడ్డి, డా. సి.రోహిణిల సహాయ సహకారాలతో 30 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, రాము, వెంకటేశ్వర్లు, శ్రీను, రమేష్, శ్రీహరి, శ్రీనివాసులు, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# హత్య కేసులో నిందితులు అరెస్ట్

## డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు పట్టణం అశోక్‌నగర్‌లో జరిగిన హత్య సంఘటనలో నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 8వతేదీ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ పట్టణంలోని అరుంధతివాడలో కొల్లపూడి వెంకయ్య అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురైనట్లు తెలిపారు. ఈ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నామని డిఎస్పీ తెలిపారు. ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదాలు హత్యకు దారి తీశాయని పేర్కొన్నారు. వెంకయ్యను హత్య చేసిన ముద్దాయిలు నాని, రవితేజ, చిన్న, పెంచలయ్య, తిరుపతయ్య, వెంకటేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో టౌన్ సి.ఐ హజరత్‌బాబు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రషీద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# బాలింతలకు పోషకాహారం



గూడూరు వైజెపి లయన్స్ క్లబ్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల గూడూరు ప్రభుత్వాసుపత్రి, డెలివరీ వార్డులోని బాలింతలకు పోషకాహారం అందించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ఎల్ఎన్ స్వామి దాతృత్వంతో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్‌ఛైర్మెన్ గురునాథం, పాస్ట్ రీజియన్ ఛైర్మెన్ ఆర్.వి.రావు, ట్రెజరర్ మనోజ్, ప్రభుత్వ డాక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి




కళాశాలలో జూనియర్లు, సీనియర్లు అనే తేడా లేకుండా స్నేహపూర్వకంగా మెలగాలని ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి, ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తున్నారని, వారి కష్టం వృథా చేయకుండా బాధ్యతగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ప్రతినిధులు కోటేశ్వరరావు, గోపీకృష్ణ, అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.

# వికలాంగులకు నిత్యావసర వస్తువులు



గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ 'రెడ్' సంస్థ ఆధ్వర్యంలో పి.విజయ, ఎం.లక్ష్మిల దాతృత్వంతో ఇన్నర్‌వీల్ క్లబ్ మరియు ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు విష్ణువందన, మహిళా మండలి అధ్యక్షురాలు జమునమ్మ, కార్యదర్శి స్నేహలతరెడ్డి, ఎస్.లక్ష్మి, రెడ్ సంస్థ ప్రెసిడెంట్ జానా సుధీర్, శ్రీనివాస ఆచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## కాకర్లకు.. పర్వతరెడ్డి శుభాకాంక్షలు

సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఇటీవల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయవాడలో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మధ్యాహ్నభోజన పథకం కార్మికుల ఆందోళన



మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించిన బిల్లులను, సిబ్బంది వేతనాలను ప్రభుత్వం క్రమం తప్పకుండా నెలనెలా చెల్లించాలని, కార్మికులకు యూనిఫామ్ అందించాలని, ప్రమాదబీమా సదుపాయం కల్పించాలని తదితర డిమాండ్లతో నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 7న మధ్యాహ్నభోజన పథకం కార్మికులు ఆందోళన నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానాబేగం మాట్లాడుతూ, గ్యాస్ ధర పెరిగినా మెనూ చార్జీలు మాత్రం పెంచలేదన్నారు. భోజనం తయారీకి అవసరమైన పాత్రలు, గ్యాస్, స్టౌలు వగైరాలన్నీ ఇవ్వాలని, కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

### డిసిఎంఎస్ ఆధ్వర్యంలో

## త్వరలో జనరిక్ మందులషాపు

జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ప్రజల సౌకర్యార్థం తొలిసారిగా నెల్లూరులో జనరిక్ మందులషాపును ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇటీవల నెల్లూరులోని ఆ సంస్థ పాలకవర్గం సమావేశంలో ఆ నిర్ణయం తీసుకున్నారు. డీసీఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు రంగనాథం, సలీమ్, సురేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సొసైటీ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత పాలకవర్గ పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలకవర్గం వారు కృతజ్ఞతలు తెలిపారు.

## స్వాతంత్ర్య భారతి



ఆదర్శ భావాల స్వాతంత్ర్య భారతి
ప్రేమను రాగాల పెన్నిధికే
వరమది
త్యాగధనుల ఫలితాన
శాంతి పథమెంచుకొని
అహింసా వాదన స్నేహ కీర్తి పొందినది
ఉజ్వల ఊహలలో ఒడుదుడుకులు
దాటుకొని
విజ్ఞాన ప్రతిభతో వైజ్ఞానిక రంగాన
ఉన్నత శిఖరాలలో మేటిగా నిలిచింది
సాటిమనిషి మనుగడ కోసం
కులమత భాషా భేదాలే వదలుకొని
సమైక్యతాసాధనే నాగరిక లక్ష్యంగా
మువ్వన్నెల జండా వినువీధి కెగరగా
సస్యశ్యామల ప్రగతినే సాధించుకొంది.



**డాక్టర్ దూబగుంట రామకృష్ణ**
తిరుపతి. 9652021126

### రొయ్యల ఎగుమతుల ప్రోత్సాహానికి

# తీసుకుంటున్న చర్యలేమిటి?

### రాజ్యసభలో ప్రశ్నించిన బీఎంఆర్



రొయ్యల ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కృషిచేస్తోందని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఈనెల 4న రాజ్యసభలో ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాలుగా ఉత్పత్తుల వారీగా సముద్ర ఎగుమతుల వివరాలు తెలియజేయాలని కోరారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపెడా) రొయ్యల ఎగుమతులను ప్రోత్సహించడానికి ఏదైనా చర్యలు తీసుకుందా?.. ఎగుమతి ఆధారిత రొయ్యల కంపెనీలకు, మత్స్యకారుల సంఘాలకు ప్రోత్సాహకాలనేమైనా పెంచిందా అని ప్రశ్నించారు. అందుకు కేంద్ర వాణిజ్య–పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయల్ సమాధానమిస్తూ, గడచిన మూడు సంవత్సరాలలో దేశంలో 12 రకాల సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయడం జరిగిందని, 2020–21 సంవత్సరంలో 5957 మిలియన్ డాలర్ల ఉత్పత్తులు, 202–22వ సంవత్సరంలో 7767 మిలియన్ డాలర్లు, 2022–23వ సంవత్సరంలో 8073 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను ఎగుమతిచేశామని తెలిపారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహించడానికి ఎంపెడా అనేక చర్యలు చేపట్టిందన్నారు. అండమాన్ దీవిలో నిర్దిష్ట వ్యాధికారక రహిత (ఎస్‌పిఎఫ్) టైగర్ రొయ్యల పెంపకం ప్రాజెక్ట్ కోసం న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని, ఇది దేశీయ రొయ్యల ఉత్పత్తికి, ఎగుమతులకు ఊతమిస్తుందని తెలిపారు.

## వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల స్థితిగతులేమిటి?

వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల కార్యక్రమంపై ఈనెల 7న రాజ్యసభలో బీఎంఆర్ (బీద మస్తాన్‌రావు) పలు ప్రశ్నలు వేశారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల ఏర్పాటు కింద ఏర్పాటు చేసిన రెండు అదనపు వాణిజ్య–కమ్–వ్యూహాత్మక సౌకర్యాల స్థితి ఎలా ఉందని ప్రశ్నించారు. అదేవిధంగా, వాటి మొదటి దశ కింద ఇప్పటికే ఏర్పాటు చేసిన పెట్రోలియం నిల్వ సౌకర్యాలను విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోందా అని కూడా అడిగారు. కేంద్ర పెట్రోలియం మరియు సహజవాయువు మంత్రిత్వ శాఖలోని రాష్ట్ర మంత్రి రామేశ్వర్ తెలి సమాధానమిస్తూ, జూలై 2021లో భారత ప్రభుత్వం అదనంగా రెండు కమర్షియల్–కమ్–స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ సౌకర్యాల ఏర్పాటును ఆమోదించిందని తెలిపారు.

## బాలల అవార్డులకు దరఖాస్తులు పంపండి

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలు–2023కు అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు, సామాజిక, సేవారంగం, ధైర్యసాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగాల్లో అత్యంత ప్రతిభ చూపిన బాలబాలికలు ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. జిల్లాలోని 18 సంవత్సరాల లోపు బాలబాలికలందరూ ఆయా రంగాల్లో వారి ప్రతిభాపాటవాలను తెలుపుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

# వాననీటిని కాపాడుకోవాలి



విక్రమ సింహపురి యూనివర్సిటీ (విఎస్‌యు)లో వాననీటిని పరిరక్షించే కార్యక్రమాన్ని ఇటీవల చేపట్టారు. నెహ్రూ యువ కేంద్ర–నెల్లూరు వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంకుడు గుంతలు తవ్వడం, మొక్కల నాటడం, విద్యార్థులకు అవగాహన కోసం వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడమే కాక, వాననీటిని పరిరక్షించే ఇతివృత్తంతో రూపొందించిన నాటకాన్ని కూడా ప్రదర్శించారు. వాననీటిని కాపాడుకోవాలని, భూగర్భజలాల వృద్ధికి వర్షపునీరు వృథాకాకుండా నిలువచేయాలని సూచించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు 17న

నెల్లూరు జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు ఆగస్టు 17న జరుగుతాయని జడ్పీ సిఇఒ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయని, స్థాయీసంఘాల సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

## టూకీగా...



### నెలాఖరు వరకు ఇకెవైసీ గడువు పొడిగింపు

పిఎం కిసాన్‌కు అర్హులైన రైతులు ఇకెవైసి చేయించుకునేందుకు ఆగస్టు నెలాఖరు వరకు గడువు పొడిగించారని ఏఓ సిహెచ్ ఆదిలక్ష్మి తెలిపారు ఇకెవైసి నమోదు చేయించుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటల వివరా లను వెంటనే నమోదు చేయించుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### నందవరం ఆదర్శపాఠశాల తనిఖీ

మర్రిపాడు మండలంలోని నందవరం గ్రామంలో ఉన్న ఆదర్శపాఠశాలను ఇటీవల కావలి డెప్యూటీ డీఇఓ రఘురామయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, విద్యాబోధన తీరును ఉపాధ్యాయులతోను, అక్కడ చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులతోను చర్చించారు. ప్రిన్సిపాల్ పేట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కావలిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

కావలి మునిసిపాలిటీ పరిధిలోని బాలకృష్ణానగర్‌లో పేకాటాడుతున్న ఏడుగురిని ఈనెల 7న కావలి రూరల్ సిఐ రాజేష్ అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.

### జోరేపల్లిలో కోడిపందాల స్థావరాలపై దాడులు

రాపూరు మండలంలోని జోరేపల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఈనెల 7న తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక పందెం కోడిని, 3650 రూపాయలతో పాటు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

### దామరమడుగులో తల్లిపాల వారోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగులోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 7న తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. తల్లులకు, గర్భిణులకు తల్లి పాల విశిష్టతను తెలియజేశారు. తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని చెప్పారు. ముర్రుపాలతో బిడ్డలకు వ్యాధినిరోధకశక్తి లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శేషమ్మ, సుజాత, విజయమ్మ, రమణమ్మ, లలిత పాల్గొన్నారు.

### కసుమూరులో రజక వృత్తిదారుల సమావేశం

వెంకటాచలం మండలంలోని కసుమూరులో ఈనెల 7న రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ, రజక కార్పొరేషన్ ద్వారా ప్రతి రజక కుటుంబానికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

### పెన్నానదిలో పసికందు మృతదేహం

నెల్లూరులోని పెన్నానది వద్ద ఈనెల 7న స్థానికులు ఓ మగ పసికందు మృతదేహాన్ని గుర్తించారు. ఆ సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఎస్ఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికితీయించి, ఆ పసికందు మృతిపై విచారణ చేపట్టారు.

### ఇందుకూరుపేటలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

ఇందుకూరుపేటలోని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లోని వ్యవసాయ సిబ్బందికి సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్ ఈనెల 7న శిక్షణ ఇచ్చారు. పంట వివరాల నమోదుపై శ్రద్ధ తీసుకొని సకాలంలో ఇకెవైసి చేయించాలని చెప్పారు. ఏఓలు రఘునాథ్‌రెడ్డి, జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు.

### బాలికల హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ

నెల్లూరులోని బట్వాడిపాళెంలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినుల సౌకర్యార్థం వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి ఈనెల 6న 30 వేల రూపాయల విలువైన సీలింగ్‌ఫ్యాన్లను అందజేశారు.

# ఆంధ్రా టు అమెరికా వయా హైదరాబాదు!

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ముతో పాటు, రిటైర్మెంట్ తరువాత వచ్చిన మొత్తం కలిపి తన దగ్గర 3కోట్ల రూపాయలు పోగుచేసుకున్నాడు. తన బిడ్డలకి తలకో కోటి రూపాయల చొప్పున ఇచ్చాడు. తానూ, తన ఇల్లాలి కోసం ఒక కోటి ఉంచుకున్నాడు.

నాన్న ఇచ్చిన డబ్బు గుర్తుగా ఉంటుం దిలే అని కొడుకు ఆ మొత్తాన్ని పెట్టి నెల్లూరులో ఒక స్థలం కొనుక్కున్నాడు. కూతురు రియా మాత్రం ఆ మొత్తం కోటి రూపాయలను తీసుకెళ్లి తన స్నేహితుల భాగస్వామ్యంతో హైదరాబాదులో పెట్టు బడి పెట్టి 10 ఎకరాల పొలం కొనింది. ఇది జరిగింది 2017లో. అప్పటికే రాష్ట్రం విడిపోయి 3సంవత్సరాలు అయ్యింది. ఆ తరువాత ఆమె ఆ స్థలం గురించి మర్చి పోయింది. ఇప్పుడు ఆరు సంవత్సరాల తరువాత అంటే 2023లో రియా సోద రుడు కొన్న స్థలం ఓ పాతిక లక్షలు పెరి గింది. కోటి రూపాయలు పెట్టుబడి పెడితే ఇప్పుడు ఆ స్థలం కోటి ఇరవై అయిదు లక్షలకి అడుగుతున్నారు. హైదరాబాదులో రియా చౌదరి కొన్న 10ఎకరాలు 20కోట్లు అయ్యింది. ఇది ఆమె కలలో కూడా ఊహించలేదు. నాన్న ఇచ్చిన మొత్తం ఎప్పటికప్పుడు అమెరికాకు తీసుకువెళ్లే ఉద్దేశం లేక హైదరాబాదులో పెట్టింది. ఇప్పుడు ఆమె కోటి రూపాయలు కాస్తా పిల్లలు పెట్టినట్లు 20 కోట్లు అయ్యింది. పోనీ ఆ ఇరవై కోట్లు ఆమె భారతదేశం లోనే పెట్టుబడి పెడుతుందా అంటే... అదీ లేదు. హవాలా రూపంలో అమెరికాకి తీసుకెళ్లిపోతుంది. ఇదీ ఇప్పుడు తెలంగా ణకి ఆంధ్రకి ఉన్న వ్యత్యాసం.

ఆంధ్రలో ఉన్న బడా వ్యాపారస్తు లంతా హైదరాబాదుకి తరలిపోతున్నారు. తడ నుండీ ఇచ్చాపురం వరకు భూతద్దం పెట్టి వెతికినా... తడ వద్ద శరవేగంగా ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ పారిశ్రామికవాడ మినహా ఒక్క కొత్త పరిశ్రమ కూడా కనిపించదు. ఒకటి అరా రాష్ట్రానికి వచ్చాయని పాలకులు బీర విడుచుకుని చెప్తున్నా, అవి శంకుస్థాపన లతోనే ఆగిపోయాయి తప్ప ప్రారంభోత్స వాలకు నోచుకోలేదు. మన రాష్ట్రం నుండి లక్షల కోట్ల రూపాయల ధనం హైదరా బాదుకి తరలిపోతోంది. ఈరోజు కోకా పేటలో ఎకరా వందకోట్లకి పైగా వేలంలో పలికిందంటే ఆ డబ్బంతా మనవాళ్లదే. మనదగ్గర నుండి మోసుకెళ్లి అక్కడ పెట్టిందే.

రాష్ట్రం రెండు ముక్కలై తొమ్మిదిన్నర సంవత్సరాలు గడిచినా ఇంతవరకు ఆంధ్రకి రాజధాని లేదు. కొత్తగా ఉద్యో గాలు లేవు. పారిశ్రామిక అభివృద్ధి లేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు లేవు. కొత్తగా పనులు లేవు. అంతకముందు ప్రైవేటు సెక్టార్లో ఉంటుండిన మద్యం, మైనింగ్, ఇసుక, సిలికా వ్యాపారాలు ప్రభుత్వమే చేస్తోంది. ఐటీ సెక్టార్లో కొత్తగా సంస్థలు పెట్టుకోవడానికి అవకాశం లేకుండా ఆ పని కూడా ప్రభుత్వ పెద్దల వారసులే చేస్తున్నారు.

## రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రాని ఎన్ఆర్ఐలు

ఇలాంటి దయనీయ పరిస్థితులలో స్థిరాస్తులలో పెట్టుబడి పెట్టినా కనీసం బ్యాంకు వడ్డీలు కూడా రావడంలేదని రియల్ వ్యాపారులు ఓవైపు లబోదిబోమం టుంటే.. ప్రవాసాంధ్రుల ఆలోచన మరోలా ఉంది. తామెక్కడో విదేశాలలో ఉంటూ రాత్రి పగలూ కష్టపడి తిండి తిప్పలు లేకుండా డబ్బులు మిగిల్చి, ఆంధ్ర రాష్ట్రంలో తమ సొంత ఊళ్లలో స్థలాలు కొంటుంటే వాటికీ కనీస ధర కూడా రావడంలేదు. భవిష్యత్తు బాగుంటుం దేమో, మరికొన్ని రోజులు వుండిద్దాంలే అనుకుంటే, వారి స్థలాలకి రక్షణ కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు. తమ స్థలాలను ఎప్పుడు ఎవరు వచ్చి ఆక్రమిస్తారో అని వణికిపోతున్నారు. స్వరాష్ట్రంలో ఉన్న తమ పెద్దవాళ్ళు ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో మీ స్థలాలకు మేం భద్రత కల్పించలేం అని చెప్పడాన్ని చూసి అవాక్కయిపోతున్నారు. ఇప్పటికే తమ సంపాదనతో రాష్ట్రంలో అక్కడక్కడా పెట్టుబడి పెట్టిన ఎన్ఆర్ఐలు తమకి వచ్చినమేరకి లాభం చాలంటూ, ఉన్న ఆస్తులను అమ్ముకుని వెళ్లిపోతున్నారు. కొంతమందైతే లాభం లేకపోయినా పరవా లేదు, స్థలం దక్కితే చాలు భగవంతుడా అన్నట్లుగా నష్టానికి అమ్ముకోవడానికైనా సిద్ధపడిపోతున్నారు. వీరైతే తిరిగి తమ దేశాలకి, లేదంటే హైదరాబాదుకి తమ సొమ్మంతా తరలిస్తున్నారు. 'ఇక్కడ పెరిగే సంగతి దేవుడెరుగు, మా స్థలం మాకు ఉంటుందా లేదా అన్న భయమే ఎక్కువగా ఉంది' అంటూ ఆంధ్రా వదిలి పారి పోతున్నారు.

## ఆంధ్రోళ్ళని స్వాగతిస్తున్న కేసీఆర్

ఒకప్పుడు ఆంధ్రోళ్ళను తరిమికొట్టా లని మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి, ఇప్పుడు ఆంధ్రావాళ్లకి బ్రహ్మరథం పడుతున్నారు. తెలంగాణ పారిశ్రామి కంగా అభివృద్ధి చెందడానికి ఆంధ్రావాళ్ళే కారణం అని పొగుడుతున్నారు. జగన్‌తో విభేదించిన అమర్‌రాజా వంటి సంస్థలకి దండేసి స్వాగతం చెప్తున్నారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాల గురించి అవకాశ మొచ్చినప్పుడల్లా రెండు రాష్ట్రాలను పోల్చి తాను మాట్లాడడమే కాకుండా, తరచూ తన మంత్రులతో, పార్టీశ్రేణులతో కూడా మాట్లాడిస్తున్నారు. ఒకవైపు జగన్ తనకు మిత్రుడని చెప్తూనే, మరోవైపు ఆంధ్రాను అవహేళన చేస్తున్నారు.

## రాష్ట్రంలో మార్పు రావాలి

అభివృద్ధి, మౌలిక వసతులు అంశం పక్కనపెడితే, ప్రవాసాంధ్రులు రాష్ట్రం విడిచి పారిపోకుండా చూడాలని రియల్ వ్యాపారులు కోరుతున్నారు. ఎన్ఆర్ఐల స్థలాలను కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్న రాజకీయ ప్రతినిధులను, వారి అండతో రెచ్చిపోతున్న వారి అనుయా యులను జగన్ ప్రభుత్వం కట్టడి చేయా లని అంటున్నారు. ఇప్పటికే ఆస్తులు ఉన్న వారికి, మీ ఆస్తులకు మేం రక్షణ కల్పిస్తాం అన్న భరోసా ప్రభుత్వం ఇవ్వగలిగితే... కనీసం వారన్నా తరలిపోకుండా ఉం టారని, అలాంటి హామీ లభిస్తే కొత్తవారు కూడా రాష్ట్రంలో స్థలాలు కొనడానికి ముందుకొస్తారన్న ఆశాభావాన్ని స్థిరాస్తి వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు..!



# పాటకు పోరాటం నేర్పిన.. గద్దర్ ఇక లేరు

***'గద్దర్'..ఆ పేరు వింటేనే వణుకుతున్న చేతివేళ్ళు కూడా పిడికిళ్ళవుతాయి. పోరుబాటలో దూకి కొడవళ్ళవుతాయి. ఆయన పాట వింటే నిస్సత్తువతో ఉన్న దేహం కూడా ఉత్తేజం పుంజుకుంటుంది. విప్లవ కెరటమై ఉరకలెత్తుతుంది. 'మాభూమి' సినిమాలో ఆయన పాడిన 'బండెనక బండి కట్టి..పదహారు బండ్లు గట్టి' అనే పాట తెలంగాణ సాయుధ పోరాటానికి నిలువెత్తు బావుటాగా నిలిచింది. అదే కాదు, ఆయన ఏ పాట పాడినా జనం గుండెల్లో ఢమరుకమై మారుమోగుతుంది. ఆయన ఏ మాట మాట్లాడినా సూటిగా తూటాలా పేలినట్లు ఉంటుంది. విప్లవగీతాలు వినాలంటే ఆయన గొంతుతోనే వినాలి. విప్లవోద్యమానికి మహోద్విగ్నమైన ఆ ధిక్కారస్వరం ఇక ఎవరి నోటా వినలేం. గద్దరంతటి ఒక మహాద్భుత విప్లవవీరుడిని ఇక మనం చూడలేం. ఈ తరానికి బహుశా ఆయనొక్కరే అంతటి ప్రసిద్ధిగన్న విప్లవ గాయకుడు.***

గజ్జకట్టి, చేత కర్రపట్టి, ఎర్రజెండా ఎత్తిపట్టి, కష్టజీవుల కోసం గొంతెత్తి పాడుతూ 'భద్రం కొడుకో' అంటూ జాగ్రత్తలన్నీ చెప్పి, పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా'..అంటూ జనం గుండె తట్టి..'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా.. తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మా'..అంటూ ఒట్టుపెట్టిన ప్రజాఉద్యమకారుడు గద్దర్ ఇక లేరు. ఆగస్టు 6వ తేదిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని అమీర్‌పేట ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మానవాభ్యుదయం కోసం, స్వేచ్ఛకోసం..సమానత్వం కోసం పాటనే శ్వాసగా కడదాకా జీవించిన ప్రజాగాయకుడి కంఠం మూగబోయింది. ఆయన మరణం అశేష ప్రజానీకాన్ని కలచివేసింది. తెలుగు ఉద్యమగీతం శోకసంద్రంలో మునిగిపోయింది. వేలాదిమంది కళాకారులు గద్దర్ లేరనే మాటనే జీర్ణించుకోలేక.. ప్రాణానికి ప్రాణమైన తోబుట్టువు దూరమైనట్లుగా విలవిలలాడిపోయారు.

'గుమ్మడి విఠల్ నా పేరు. గద్దర్ నా పాట పేరు. నా బతుకు సుదీర్ఘ పోరాటం. నా వయస్సు 76 ఏళ్ళు.. నా వెన్నుపూసలో ఇరుక్కున్న తూటా వయస్సు పాతికేళ్లు'... అని ఒక సందర్భంలో చెప్పుకున్నారాయన. ప్రజాసమస్యలు, పేదల కష్టాలు కన్నీళ్లు అన్నీ కలిపితే అదే గద్దర్ పాట. నక్సల్ పంథాలో, మావోయిస్టు ఉద్యమబాటలో నడిచిన గద్దర్ ఎన్నో కష్టాలు పడ్డారు. ఎంతో గుండెధైర్యంతో, సాహసంతో ఆయన జీవితం సాగింది.

70 ఏళ్ల వయసులో తొలిసారిగా గద్దర్ 2018లో ఓటు వేశారు. 'పోరాటమంటే తుపాకులు పట్టుకోవడం కాదు..తిరుగుబాటు చేయడం'.. అని గుర్తించి ప్రజాజీవితం లోకి వచ్చానని ఆయనే చెప్పుకున్నారు. 'గోచీ గొంగడి, గజ్జెలు జమ్మిచెట్టు మీద పెట్టినా'నంటూ ఆయన స్వయంగా ప్రకటించుకున్నారు. ఏదేమైనా పాటనే జెండాగా.. తన జీవిత అజెండాగా చేసి..పాటకు పోరాటాన్నే ఊపిరిగా పోసి, ప్రజా ఉద్యమాలకి ఉన్న ఆయువునంతా పోసి..జీవితాంతం ప్రజాచైతన్యానికి అనితరసాధ్యమైన కృషి చేసిన ఏకైక ప్రజాగాయకుడు గద్దర్..ఇక లేకపోవడం..ప్రజాఉద్యమాలకీ..ఉద్యమపాటల లోకానికే తీరని లోటు.

# చిరంజీవి మళ్ళీ రాజకీయాలలోకి వస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

పొలిటికల్ స్టార్‌కి వ్యతిరేకంగా గ్లామర్ స్టార్స్ అన్నీ ఏకం కాబోతున్నాయని 'స్టార్ వార్' పేరుతో 'లాయర్' వార్తాపత్రిక క్రితమే రాసింది. ఆ వార్తపై సామాజిక మాధ్య మాల్లో ఉవ్వెత్తున వ్యతిరేకత కూడా వచ్చింది. ఇప్పుడు తాజాగా వాల్తేరు వీరయ్య చేసిన ఘాటు కామెంట్స్ ఆనాటి 'లాయర్' వార్తకి బలాన్ని చేకూరుస్తున్నాయి.

వాల్తేరు వీరయ్య సినిమా 200 రోజుల ఫంక్షన్‌లో పేరు ప్రస్తావించకుండా..... 'మీలాంటి వాళ్ళు ప్రత్యేకహోదా గురించి, రోడ్ల నిర్మాణం, ఉద్యోగ, ఉపాధి అవకా శాలు, ప్రాజెక్టుల గురించి ఆలోచించాలి. పేదవారి కడుపునింపే దిశగా ప్రయత్నాలు చేయాలి. అలాచేస్తే అందరూ మీకు తల వంచి నమస్కరిస్తారు. అంతేగానీ, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాగా సినీ పరిశ్రమపై పడతారేంటి' అని చిరంజీవి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆంధ్రా ప్రభుత్వం అని చెప్పకపోయినా అందులో దాగేముంది? అవన్నీ సీఎం జగన్‌ని ఉద్దే శించి అన్న మాటలే. ప్రత్యేకహోదా అన్నా రంటే ఆ సమస్య ఇప్పుడు ఆంధ్రాదే కదా..! ఇందులో అర్థం కానిదేంటంటే టికెట్ రేట్ల పెంపు వ్యవహారం ఎన్నడో ముగిసిపోయిన అధ్యాయం. తన సినిమాకి కావలసిన అన్ని సడలింపులు చిరంజీవి పొందుతూనే ఉన్నారు.

ఇప్పుడు తాజాగా జగన్ కూడా సినిమా పరిశ్రమపైన విమర్శలేం చేయ లేదు. అలాంటప్పుడు, వేల కోట్ల విలువైన సినిమా ఇండస్ట్రీని మెగాస్టార్ పిచ్చుకతో పోల్చడం విడ్డూరంగా ఉంది...! అంటే చిరంజీవి వ్యాఖ్యల వెనుక మరేదో లక్ష్యం ఉందని రాజకీయ విశ్లేషకుల అంచనా. తన తమ్ముడు పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయోజనాల కోసమే జగన్ మీద రాజకీయ దాడి ప్రారంభించారని అర్థమవుతోంద న్నది వారి అభిప్రాయం. రాబోయే రోజుల్లో జగన్ వ్యతిరేక శిబిరంలో చిరం జీవి కీలకపాత్ర పోషించబోతున్నారన దానికి ఈ వ్యాఖ్యలను సంకేతంలా భావిం చాలన్నది విశ్లేషకుల భావన.

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'బ్రో' సినిమాలో మంత్రి అంబటి రాం బాబును అనుకరిస్తూ నటుడు పృథ్వీతో రెండు సీన్లు చేయించారు. దానిపై మంత్రి తీవ్రంగా స్పందించారు. సినిమావాళ్ళ అంతు తెలుస్తా... అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ అంశం వైసీపీ, జనసేనల మధ్య అగ్గి రగిల్చింది. ఇదే తరుణంలో ఏపీ ప్రభుత్వంపై చిరంజీవి ఘాటు వ్యాఖ్యలు, ఆ తర్వాత చిరుపై వైసీపీ మం త్రుల మూకుమ్మడి మాటల దాడి, సోషల్ మీడియాలో 'బాయ్‌కాట్ భోళాశంకర్', 'బాయ్‌కాట్ మెగా హీరోస్' అంటూ వైసీపీ శ్రేణుల హడావుడి మొదలైంది. ఓవైపు ఇవి జరుగుతుండగానే, మరోవైపు ఏ పార్టీలో ఉన్నారో తెలియని గంటా శ్రీనివాస్, వైఎస్ కుటుంబ శ్రేయోభిలాషి ఉండవల్లి అరుణ్‌కుమార్ బహిరంగంగానే చిరంజీవి వ్యాఖ్యలకు మద్దతు పలకడం గమనార్హం. ఇవన్నీ గమనిస్తే చిరంజీవి రాజకీయాల్లో రీఎంట్రీకి సిద్ధమవుతున్నట్టు స్పష్టమవుతోంది.

రాజకీయాలలో అనేక అనుభవాల తరువాత చిరంజీవి మళ్ళీ వాటి జోలికే వెళ్ళలేదు. తనకు రాజకీయాలు పనికి రావనే అర్థం వచ్చేలా పలు సందర్భాల్లో మాట్లాడారు. చిరంజీవి మా పార్టీలోనే ఉన్నాడంటూ కాంగ్రెస్‌పార్టీ స్టేట్‌మెంట్లు ఇచ్చుకున్నా సరే ఆయన స్పందించలేదు. ఉన్నాననలేదు, లేననలేదు. వైసీపీ నేరుగా రాజ్యసభ స్థానం ఆఫర్ చేసినా సున్నితంగా తిరస్కరించారు. చిరంజీవిని బీజేపీలోకి తీసుకొచ్చేందుకు ప్రధాని మోదీ స్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. కానీ, తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానని తెగేసి చెప్పారు.

'నా తమ్ముడు పవన్ కళ్యాణ్ గొప్ప వ్యక్తి, ఎప్పటికైనా ముఖ్యమైన స్థాయిలో ఉండాలనుకుంటున్నాను, జనసేనకు నావంతు సహాయం చేస్తానంటూ' కూడా గతంలో ఒకసారి చెప్పారు. మరి ఉన్న ట్టుండి ఇలా మాట్లాడడంలో కొత్త భావం వెతుక్కోవలసి వస్తోందని సినీ వర్గాలు కూడా అంటున్నాయి.


ఇండస్ట్రీకి పెద్ద ఎవరు...? అన్న ప్రశ్న వచ్చినప్పుడల్లా చిరంజీవి పేరు గట్టిగా వినిపిస్తోంది. ఇందుకు తగ్గట్టుగానే ఏపీ ప్రభుత్వంతో టికెట్ రేట్ల పెంపు సమస్య వచ్చినప్పుడు, రాయబార బాధ్యత తన భుజాన వేసుకుని తాడేపల్లి చుట్టూ తిరిగారు. తెలంగాణ ప్రభుత్వంతో కూడా చిత్రసీమకు సంబంధించిన వ్యవహారాలు చక్కబెట్టి పెద్దన్న పాత్ర పోషిస్తూ వస్తున్నారు. సమాజంపై సినిమాల ప్రభావం చాలా ఎక్కువ. అదే సమయంలో సినిమాస్టార్లు ఓటర్ల మనసును ప్రభావితం చేయగలరా అంటే ఖచ్చితంగా చేయలేరు అని గత అనుభవాలు నిరూపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో చిత్రసీమలోని స్టార్లంతా చిరంజీవి వెనుక నడుస్తారా...? చిరంజీవి చెప్పినట్లుగా పిచ్చుకంత సినీ పరిశ్రమ కొండంత జగన్‌ని ఢీ కొం టుందా...? లేదా తమ కెందుకులే అని మౌనంగా ఉండిపోతుందా..?? అన్నది వేచిచూడాలి..!

# పంచాయతీలను నీరుగార్చిన రాష్ట్ర ప్రభుత్వం

## బీజేపీ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి ధ్వజం

రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధిని వైకాపా ప్రభుత్వం నీరుగార్చిందని, సర్పంచ్‌ల హక్కులను కాలరాసి గ్రామాలను అంధకారబంధురం చేస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 8న ఆయన చేజర్ల మండలం లోని పలు గ్రామాల్లో ఉన్న సర్పంచ్‌లను కలసి వారి బాధలను విన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేక సర్పంచ్‌లు పడుతున్న కష్టాలను నేరుగా



వారిద్వారానే తెలుసుకున్నారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా గ్రామాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను విడుదల చేస్తుంటే, రాష్ట్రప్రభుత్వం ఆ నిధులను పక్కదారి పట్టిస్తూ గ్రామాలను సమస్యల నిలయాలుగా తయారుచేస్తోందని ఆయన విమర్శిం చారు. గ్రామ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణకు బీజేపీ ఉద్యమం చేపడుతుందని చెప్పారు. బీజేపీ స్థానిక నాయకులు కుంకు బాలయ్య, బత్తుల కృష్ణయ్య, వెంకట రామానాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, నాగులవెల్లటూరు సర్పంచ్ ఎస్‌కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# విఆర్‌ఏల దీక్షలు

విఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 8న నెల్లూరు కలెక్టరేట్ వద్ద పలువురు విఆర్‌ఏలు రిలే దీక్షలు నిర్వహించారు. గ్రామ రెవిన్యూ సహాయ కుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షల్లో షరీద్, భాస్కర్, బాషా, సీతమ్మ, అంకయ్య, ప్రసాద్, శీను తదితరులు పాల్గొన్నారు. విఆర్‌ఏలకు కనీస వేతనంగా రూ. 26వేలు ఇవ్వాలని, పేస్కేల్‌ను అమలుచేసి విఆర్‌ఏలను ప్రభుత్వోద్యోగులుగా పరిగణించాలని వారు కోరారు.

# ఢిల్లీకే కాదు, దేశానికీ... ఓ ఆర్డినెన్స్ కావాలి!




దేశ రాజధాని అయిన ఢిల్లీ ప్రభుత్వంలో పనిచేసే అఖిల భారత సివిల్ సర్వీస్ అధికారుల ఆలన, పాలన బాధ్యతలను కేంద్ర ప్రభుత్వమే నేరుగా చేపట్టింది. ఈ మేరకు మొన్నో ఆర్డినెన్స్‌ను కేంద్రం జారీ చేసింది. ఇప్పుడు దాని స్థానంలో బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రపతి ఆమోదముద్ర పడగానే, అది చట్టం అవుతుంది. దీంతో, ఢిల్లీ ప్రభుత్వంలో పనిచేసే కేంద్ర సర్వీస్‌లకు చెందిన అధికారుల పాలనాపరమైన బదిలీలు, ప్రమోషన్లు, డిసిప్లినరీ చర్యలపై ఢిల్లీ ప్రభుత్వ సారథులకు ప్రమేయం ఉండదు.

ఢిల్లీ ప్రభుత్వం వరకే పరిమితమైన ఇటువంటి ఆర్డినెన్స్/చట్టం మొత్తం దేశానికి కావాలి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పరిధికీ వర్తింప చేసేలా కావాలి. 30 సంవత్సరాలకు పైబడి సర్వీస్‌లో తమ సేవలు దేశానికి అందించడానికి ప్రతిభ ఆధారంగా ఎంపికైన ఈ అధికారులపై... ఓ అయిదేళ్లు గాలికో... ధూళికో అధికారంలోకి కొట్టుకువచ్చిన ఆవారాల వంటి వారి కర్రపెత్తనం చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా ఢిల్లీ వరకు నిరోధించింది. నోటితో కాకుండా, బుర్రతో ఆలోచించేవారు ఈ మార్పును హర్షించవలసిందే.

ఒక శాసనసభ్యుడుగానో, ఒక ఎం.పీగానో, ఒక మంత్రిగానో, ఒక ముఖ్యమంత్రి గానో, ఒక ప్రధానమంత్రిగానో భారతదేశంలో పుట్టిన పౌరులు ఎవరైనా కావచ్చు. అలా కావడానికి ఎటువంటి విద్యార్హతలు అవసరం లేదు. బుద్ధి, జ్ఞానం ఉం డాల్సిన పని లేదు. మాన మర్యాదలు, మంచి నడవడిక మొదలైనవి ఉండాల్సిన పని అసలే లేదు.

హంతకులు, దొంగలు, జేబు దొంగలు, అండర్‌గ్రౌండ్ డాన్‌లు, దోపిడీ దారులు, మానభంగాలకు పాల్పడినవారు, కబ్జాకోరులు, దొంగోట్ల సాయంతో చట్టసభల్లో దూరేద్దామనుకునేవారు, దొంగ వ్యాపారాలు చేసేవారు, లిక్కర్ కింగులు, గంజాయిస్టులు, ఆర్థిక నేరస్థులతో సహా ఎవరైనా... ఏ రాజకీయహోదాకి అయినా ఓ అయిదేళ్ల నడమంత్రపు వైభోగానికి ఎన్నిక కావచ్చు. సుడి కుదిరితే, మరో అయిదేళ్లకు... ఆపై మరో అయిదేళ్లకు కూడా ఎన్నిక కావచ్చు.

హత్యలు... గృహ దహనాలు... మానభంగాలు వంటి నేరాల్లో దొరికిపోయి, గత్యంతరం లేక.... జైళ్ళల్లో కాలక్షేపం చేస్తున్నవారు కూడా ఈ రాజకీయ పదవులకు భారీ మెజారిటీలతో ఎన్నిక కావచ్చు.

ఉదాహరణకు, లోక్‌సభ సభ్యుల సంఖ్య 543/544 అయితే, ప్రస్తుత 17వ లోక్‌సభలో నేరచరిత్ర కలిగిన గౌరవసభ్యులు 233 మంది. అంటే 43 శాతం. అన్ని రాజకీయ పార్టీలనూ వీరు పునీతం చేస్తున్నారు.

అలాగే, దేశంలోని శాసనసభ్యులు సుమారు నాలుగు వేల(4000) మంది ఉంటే, వారిలో 44 శాతం మంది గౌరవ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదై, విచారణలు వివిధ దశల్లో ఉన్నాయి. అయినప్పటికీ, వీరు... మన ప్రజాప్రతి నిధులు... పాలకులు. వీరిలో అత్యధికులకు వ్యాపారాలు. రాజమార్గంలో అక్రమ ధనార్జన మార్గాలు ఈ వ్యాపారాలకు అదనం.

ఈరోజు మన దేశంలో కనిపిస్తున్న రాజకీయ దృశ్యం. 1975కు ముందు పరిస్థితులు ఇంత దారుణంగా ఉండేవి కావు.

పబ్లిక్ లైఫ్‌లోకి ఇప్పుడు ఈ నేరస్థులు ఎందుకు వస్తున్నారో వీరికి తెలుసు. ఏమి చేయాలో తెలుసు. తమ టార్గెట్ ఏమిటో వీరికి తెలుసు.

బి.ఏలు, ఎం.ఏలు, బి.టెక్‌లు, ఎం.టెక్‌లు, ఎం.బిఏలు, ఎంబీబీఎస్‌లు, ఎం.డీలు అహోరాత్రులు చదివి, ఒకటికి రెండుసార్లు, రెంటికి మూడుసార్లు పరీక్షలకు హాజరై.... సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన మేధోసంపన్నులేమో వీరి కింద బానిసలుగా మారిపోతున్నారా అనే అభిప్రాయం కలిగే విధంగా సివిల్ సర్వీస్ అధికార వ్యవస్థ తయారయిందని అనిపిస్తోంది. 'ఆరు నెలలు సావాసం చేస్తే, వారు వీరవుతారు' అనే సామెత ఉండనే ఉంది కదా!

దీనికితోడు కుల, మత, ప్రాంత, రాజకీయ రాగద్వేషాలు కూడా సివిల్ సర్వీస్ అధికారులను ఆవహిస్తున్నాయి.

రాజకీయ వాదులు, సివిల్ సర్వీసెస్ అధికారులు కలిసి రాష్ట్రాన్ని ఆనవాళ్ళు లేకుండా ఊదేశారు, ఊదేస్తున్నారు, ఊదేస్తారు. అధికార యంత్రాంగంలో ఆత్మాభిమానం అనే మాటే కనిపించడం లేదు. ఆత్మభిమానం అడ్డువస్తే, ఒకవేళ ఒక్కసారి శంకరగిరిమాన్యం పట్టాల్సివస్తే... ఆ అధికారి తిరిగి అధికార పట్టాల మీదకు రావడానికి ఏళ్ళు పూళ్లు పడుతుంది. ఒక్కొక్కసారి ఉద్యోగ విరమణ అయినా కూడా కావొచ్చు, కెరియర్లు భూస్థాపితం కావచ్చు.

అయితే, దీనికి రాష్ట్రాలలోని రాజకీయవాదులో... రాష్ట్రాలకు కేటాయింపు అయిన సివిల్ సర్వెంట్స్‌దో తప్పుకాదు. ఈ లోపం వ్యవస్థాగతమైంది.

జాతీయస్థాయిలో మెరికల్లాంటి యువతను మూడు నాలుగుసార్లు వడబోసి ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సర్వీస్‌లకు ఎంపికచేసి... వారిని రాష్ట్రాలకు శాశ్వతంగా అప్పగించేయడంలోనే ఈ లోపం అంతా ఉంది. వీరిని స్వరాష్ట్రాలకు కేటాయిం చడం వల్ల, రాష్ట్ర వాసులలో తాము అధికులమనే దృక్పథం వారికి సబ్‌కలెక్టర్, ఏసీపీ/ఏఎస్పీ స్థాయి లోనే ఏర్పడుతుంది. కుల, మత, ప్రాంత, రాజకీయ రాగద్వేషాలకు ఆ స్థాయిలోనే బలమైన బీజం పడు తుంది. మంచి మంచి(అంటే కలెక్షన్‌కు వీలైన అని) 'పోస్టింగ్'ల కోసం ఆరాటం మొదలవుతుంది. దీని కోసం 'రాజకీయాశ్రయం' అవసరం అనే ఆలోచన మొగ్గ తొడుగుతుంది. రాజకీయవాదుల అడుగులకు మడుగులొత్తే సంస్కృతి మొలకెత్తి, రానురాను వెర్రి తలలు వేస్తుంది. దాంతో, వారిని ఆ సర్వీస్‌లకు ఎంపిక చేసిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ లక్ష్యమే దెబ్బతింటోంది.






ఈ సివిల్ సర్వెంట్స్ వ్యవహారశైలికి మణిపూర్ అరాచకాలు అద్దం పడతాయి.

మణిపూర్‌లో మూడు నెలలుగా నిరాఘాటం గా జరుగుతున్న హత్యలు, గృహ దహనాలు, మాన భంగాలు, అల్లర్లు, అరాచకాలు, అమానవీయ ఘటనలను అణచి వేయలేకపోవడానికి... ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల చేతకానితనం, అసమర్థత కారణమా? కాదు.

అవి సమసిపోవడం ఆ రాష్ట్ర రాజకీయ నాయ కత్వానికి ఇష్టం లేదు. అక్కడ మెజారిటీ మణిపూర్, మైనారిటీ మణిపూర్ అనే రెండు సమాజాలుగా ఆ సమాజం విడిపోవాలి. దాంతో, అక్కడి అధికార యంత్రాంగం అక్కడి రాష్ట్ర రాజకీయ నాయకత్వానికి "జీ హుజూర్" అంటూ బుర్ర ఊపేసింది. అదే, వారి సర్వీస్‌లకు సంబంధించిన ప్రమోషన్లు, బదిలీలు ఆ రాష్ట్ర రాజకీయుల చేతుల్లో కాకుండా, కేంద్రం చేతుల్లో ఉండి ఉంటే... ఈ తరహా అరాచకాలకు అక్కడి అధికార యంత్రాంగం అవకాశం ఇచ్చి ఉండేదా?

అందుకే, ఢిల్లీ ప్రభుత్వంలో పనిచేసే సివిల్ సర్వీస్ అధికారులకు సంబంధించిన ప్రమోషన్లు, బదిలీలు, ఇతర క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వమే తన చేతుల్లోకి(ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా) తీసుకోవడాన్ని హర్షించాలి.

రాష్ట్రాలలో రాజకీయ పరిస్థితులు సైతం ఢిల్లీ రాజకీయ పరిస్థితులకు ఏమీ తీసిపోవు. అందుకే, సివిల్ సర్వీసెస్ అధికారులు, ఇకముందు ఎంపిక కాబోయే అధికారుల సర్వీస్ నిబంధనలు సమూలంగా మార్పు చేయాల్సిన అవసరం ఉంది. వారిని రాష్ట్రాల పర్యవేక్షణలో గాకుండా, కేంద్ర కేబినెట్ కార్యదర్శి పర్యవేక్షణలోకి తీసుకురావాలి. ప్రతి సివిల్‌సర్వీస్ అధికారి కనీసం 10 రాష్ట్రాలలో పనిచేసే విధంగా సర్వీస్ నిబంధనలు రూపొందించాలి. అల్ ఇండియా సీనియారిటీ ఆధారిత పదవులలో వారిని మూడు / నాలుగేళ్లకు ఓసారి ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేసే చట్టపరమైన వ్యవస్థ ఉండాలి.

ఇప్పుడు దేశంలో రాష్ట్రాల హైకోర్టులు, సుప్రీం కోర్టులో నియామకాలు, బదిలీలకు ఓ స్వతంత్ర వ్యవస్థ ఉన్న రీతిలోనే, ఐఏఎస్... ఐపీఎస్ వంటి సర్వీసులకూ ఉండాలి. దేశానికి స్వతంత్రం వచ్చిన కొత్తలో సర్దార్ వల్లభాయ్ పటేల్ మస్తిష్కం నుంచి వచ్చిన ఈ సర్వీస్‌ను ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేయాల్సిన అవసరం ఉంది.

1. వీరిని రాష్ట్రాలకు కేటాయించగూడదు. అందరూ సెంట్రల్ /కంట్రీ పూల్‌లోనే ఉండాలి.
2. కేంద్రాన్ని మినహాయించి దేశం మొత్తం ఒకే జోన్‌గా పరిగణించాలి.
3. ప్రమోషన్‌లకు దేశం మొత్తాన్ని ఒకే కేడర్‌గా తీసుకోవాలి.
4. ఎవరిని ఏ హోదాలో ఏ రాష్ట్రానికి బదిలీ చేయాలో, ఎప్పుడు బదిలీ చేయాలో వారి వారి సీనియారిటీ ప్రకారం ఈ స్వతంత్ర వ్యవస్తే నిర్ణయించాలి.
5. వీరి కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ సైతం కేంద్ర కేబినెట్ సెక్రటరీ(కార్యాల యమే) రాయాలి.
6. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ రాజకీయ సారథులు, పథకాలు మాత్రమే రూపొందించి, వాటి అమలు బాధ్యతలను సివిల్ సర్వెంట్స్‌కు వదిలివేయాలి.
7. రాజకీయ నేతలు ఆశించిన స్థాయిలో అధికారులు పనిచేయకపోతే, వారిపై కేంద్రానికి ఫిర్యాదు చేయాలి తప్ప, పొద్దున్న కోపం వస్తే మధ్యాహ్నానికి బదిలీలు, సస్పెన్షన్స్ చేసే అధికారం వారి చేత్తుల్లో ఉండకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి.

ఢిల్లీ సివిల్ సర్వీస్‌ల నిర్వహణ విషయంలో ఆర్డినెన్స్ జారీ చేసినట్టే... మొత్తం దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించే విధంగా సర్వ సమగ్రమైన ఆర్డినెన్స్‌ను తక్షణమే జారీ చేయాల్సిన అవసరం కనపడుతోంది.

ఢిల్లీ ఆర్డినెన్స్‌ను మన రాష్ట్రంలోని వైసీపీ పార్లమెంటులో సమర్థించినందున దేశం మొత్తానికి సంబంధించిన ఆర్డినెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించదు. తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించదు. అలాగే, ఒడిశా కూడా.

ఢిల్లీ ఆర్డినెన్స్ తరహాలో పార్లమెంట్ ఆమోదం పొందడానికి కేంద్ర ప్రభుత్వా నికి ఇబ్బంది ఏమీ ఉండదు. దీనివల్ల ప్రజాస్వామ్యానికి ఇబ్బంది కూడా ఏమీ ఉండదు. కేంద్రంలోని ప్రభుత్వానికి సారథ్యం వహించే పార్టీకి కూడా ప్రజలే ఆ హక్కు ఇచ్చారు. మరి, రాష్ట్రాల ప్రభుత్వాలకు సారథ్యం వహించే హక్కు ఆయా పార్టీలకు ప్రజలే కదా ఇచ్చింది అనే వాదన ఒకటి బయలుదేరవచ్చు.

అలా అనుకుంటే, ఒక రాష్ట్రంలోని నగరపాలక సంస్థలకు, మున్సిపాలిటీలకు, పంచాయితీలకు సారథులను కూడా ప్రజలే కదా ఎన్నుకునేది? మరి వారి మునిసిపల్ కమిషనర్‌లను, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లను నియమించు కునే, సస్పెండ్ చేసుకునే, వారి సర్వీస్ నియమనిబంధనలను నిర్వహించే అధికారాలను ఆయా మునిసిపల్, పంచాయతీ సంస్థలకు ఆయా రాష్ట్ర ప్రభు త్వాలు ఇవ్వలేదు కదా!

అలాగే ఒక దేశంలో భాగాలుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణ బాధ్యత కూడా కేంద్రానికి ఉంటుంది.

ఆ బాధ్యత సక్రమ నిర్వహణ కోసమే, ఆలిండియా సర్వీస్‌లు. మొత్తం దేశానికి సంబంధించిన సర్వీస్ అధికారుల సేవలను కేవలం ఒక రాష్ట్రనికే పరిమితం చేస్తే, ఆలిండియా సర్వీస్ అధికారులు ఎలా అవుతారు?

ప్రతి రాష్ట్రానికి సొంత పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉంది కదా!

**- భోగాది వేంకట రాయుడు**
medhomadhanam@gmail.com

# టీటీడీ చైర్మెన్‌గా...
# సుబ్బారెడ్డికి సెలవు.. కరుణాకరరెడ్డికి కొలువు

***తి**రుమల తిరుపతి దేవస్థానాల కొత్త చైర్మెన్‌గా తిరుపతి శాసనసభ్యుడు, దివంగత వై.ఎస్.రాజారెడ్డి శిష్యుడు, స్వర్గీయ రాజశేఖరరెడ్డి భక్తుడు, ముఖ్యమంత్రి జగన్ సమీప బంధువు భూమన కరుణాకరరెడ్డి ఆగస్టు 10వ తేదీ గురువారం ఉదయం గం.11.44 నిముషాలకి తిరుమల ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు.*

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2019 నుండి జగన్ బాబాయ్ వై.వీ.సుబ్బారెడ్డి టీటీడీ చైర్మెన్‌గా ఉన్నారు. మధ్యలో బోర్డు సభ్యులు మారినా నాలుగు సంవత్సరాల పాటు సుబ్బారెడ్డే చైర్మెన్‌గా స్వామివారి సేవలో కొనసాగారు. వై.వీకి రాజ్యసభ ఇచ్చి ఆయనని తన ప్రతినిధిగా ఢిల్లీకి పంపించాలని జగన్ భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని నెలల క్రితం సుబ్బారెడ్డికి విశాఖపట్టణం బాధ్యతలు అప్పజెప్పి రాజకీయంగా ఆయనకి ప్రాధాన్యత చేకూర్చారు కూడా. ఇప్పుడు ముఖ్యమంత్రి మరో సమీప బంధువు కరుణాకరరెడ్డికి స్వామివారి సేవాభాగ్యాన్ని కల్పించారు. సుబ్బారెడ్డి స్థానంలో కరుణాకరరెడ్డి రాబోతున్నారన్న విషయం 'లాయర్' 2022 డిసెంబర్ ఆఖరి వారంలోనే చెప్పింది. ఇప్పుడు అదే జరిగింది.

## సుబ్బారెడ్డి హయాంలో అనేక సంస్కరణలు :

టీటీడీ చైర్మెన్‌గా నాలుగేళ్ళ సమయంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను సుబ్బారెడ్డి చేపట్టారు. భగవంతుడు కేవలం వీవీఐపీలకే సంతృప్తికరమైన దర్శనం ఇస్తున్నాడన్న భక్తులలో అసంతృప్తిని తొలగించారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దర్శనాలను రద్దు చేశారు. శ్రీవాణి పథకాన్ని ప్రవేశపెట్టి 10వేల రూపాయల టిక్కెట్టు పెట్టారు. శ్రీవాణి ద్వారా దర్శనానికి వెళ్లేవారికి వీఐపీలతో సమానంగా శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా 10వేలు చెల్లించ గలిగిన భక్తులకు త్వరిత దర్శన భాగ్యం కలగడంతో పాటు టీటీడీ ఆదాయం కూడా భారీగా పెరిగింది. ఆ పథకం ద్వారా వచ్చే ఆదాయాన్ని పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకి ఖర్చు పెడుతున్నారు. సుబ్బారెడ్డి హయాంలోనే కొండలకి ఇరువైపులా ఉన్న మెట్ల మార్గాన్ని ఆధునీకరించారు. దశాబ్దాలుగా రిపేర్లకు నోచుకోని వసతి గృహాలకు మరమ్మత్తులు చేసి, ఆధునిక వసతులతో అందుబాటులోకి తెచ్చారు. ఆయన పాలన సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారు.



## కరుణాకరరెడ్డికి రెండవసారి స్వామివారి సేవాభాగ్యం

దివంగత మహానేత డాక్టర్ రాజశేఖర రెడ్డి పాలనలో 2006 - 2008 సంవత్సరాల మధ్య భూమన కరుణాకరరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మెన్‌గా రెండు సంవత్సరాలు పనిచేశారు. ఆయన చైర్మెన్‌గా ఉన్న సమయంలో ప్రారంభించిన అనేక పథకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తిరుమలకి వచ్చే భక్తులందరితో పాటు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని విద్యాసంస్థలలో ఉచిత అన్నప్రసాదం, టీటీడీ ఎఫ్ఎం రేడియో ఛానల్ పథకం







టిటిడికి భూమన కరుణాకర్‌రెడ్డి చైర్మెన్ కానున్నారని 2022 డిసెంబర్ 30న 'లాయర్' మొదటిపేజీ వార్త

కరుణాకరరెడ్డి ఆలోచనే. భగవంతుడిని నేరుగా దళితుల గడపలకి తీసుకువెళ్ళే 'దళిత గోవిందం', స్వామివారి ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్, రాజంపేటలో 107 అడుగుల అన్నమయ్య విగ్రహం వంటివి అనేకం కరుణాకరరెడ్డి సారధ్యంలో నిర్వహించిన కార్యక్రమాలే. స్వామివారి కళ్యాణ రథం ప్రారంభించి ఉమ్మడి రాష్ట్రం మొత్తం కళ్యాణ వెంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం కల్పించిన పుణ్యం కూడా కరుణాకరరెడ్డిదే.

క్యూలైన్‌లలో ఉండే భక్తులకు ఉచిత పుస్తక ప్రసాదం ఏర్పాటు చేయడం, అద్భుతమైన వ్యాఖ్యానంతో భారతాన్ని, భాగవతాన్ని రికార్డు చేయించడం... ఇవన్నీ ఆ రెండేళ్లకాలంలో జరిగినవే. ఒకటిన్నర దశాబ్దం తరువాత కరుణాకరరెడ్డికి మళ్ళీ స్వామివారి సేవచేసుకునే భాగ్యం కలిగింది. టీటీడీ గురించి అక్కడికి వచ్చే భక్తుల అవసరాల గురించి మన పురాణాలూ, ఇతిహాసాల గురించి పరిపూర్ణ అవగాహన కలిగిన కరుణాకరరెడ్డి సారధ్యంలో స్వామివారి వైభవం మరింత వైభవోపేతం అవుతుందని ఆశిస్తూ 'లాయర్' శుభాకాంక్షలు.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com